




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 208 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 4 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 208 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 4 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur







## ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు

# 'పట్టా'భిషేకం

- పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు
- గోవిందు అనే వ్యక్తి కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్
- ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని వెల్లడి
- మంగళగిరిని టీడీపీ కంచుకోటగా మార్చుతానని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని

వివరాలు 2లో..

## పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉంది

### పరిటాల సునీత సంచలన ఆరోపణలు

- మీడియా సమావేశం నిర్వహించిన టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల రవి హత్య కేసులో సీబీఐ జగన్ ను కూడా విచారించిందని వెల్లడి
- ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఫ్యాక్షన్ చిచ్చుపెట్టొద్దని హితవు

**పెన్ పవర్ డెస్క్:**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇవాళ మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉందని అన్నారు. పరిటాల రవి హత్య కేసులో సీబీఐ జగన్ ను కూడా విచారించిందని గుర్తు చేశారు. టీవీ బాంబు

వివరాలు 2లో..



## వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

- లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- వక్ఫ్ సవరణ బిల్లుపై తన వైఖరి వెల్లడించిన టీవీకే పార్టీ
- బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**తమిళ సూపర్ స్టార్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రేపు తమిళనాడు వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. సుదీర్ఘ చర్చల అనంతరం లోక్‌సభలో ఆమోదం పొందిన



## హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలు...

### స్పందించిన రఘునందన్ రావు

- విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందన్న రఘునందన్ రావు
- విద్యార్థుల పోరాటం ఫలితంగానే కోర్టు ఆదేశాలు వచ్చాయన్న బీజేపీ ఎంపీ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నడుచుకోవాలని సూచన

వివరాలు 2లో..



## విచారణకు డుమ్మా కొట్టిన కాకాణి గోవర్ధన్

- అక్రమ మైనింగ్ కేసులో పోలీసు విచారణకు కాకాణి డుమ్మా
- ఇప్పటికి మూడు సార్లు నోటీసులు జారీ చేసిన పోలీసులు
- పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారిన వైనం



**పెన్ పవర్ డెస్క్:**క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈరోజు కూడా పోలీసు విచారణకు డుమ్మా కొట్టారు. ఈ కేసులో ఇప్పటి వరకు మూడు సార్లు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయనకు నోటీసులు ఇవ్వడానికి పోలీసులు వెళ్లిన ప్రతిసారీ కాకాణి వారికి కనిపించలేదు. ఇప్పుడు మూడోసారి కూడా విచారణకు ఆయన డుమ్మా కొట్టడంతో...

వివరాలు 2లో..

## మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు



- వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని కేసు
- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్ రెడ్డి
- మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టు షాకిచ్చింది. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని గత ఏడాది సెప్టెంబర్ 23న సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తన పేరు చేర్చి అరెస్ట్ చేస్తారేమో అనే అనుమానంతో హైకోర్టును

వివరాలు 2లో..

## థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

- థాయ్‌లాండ్ లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- థాయ్ ప్రధాని షినవత్రాతో ద్వైపాక్షిక సమావేశం
- ఈ సందర్భంగా మోదీకి తిపిటక గ్రంథం బహూకరణ



**పెన్ పవర్ డెస్క్:**భారత ప్రధాని నరేంద్ర మోదీకి థాయ్‌లాండ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా విశిష్ట కానుకను అందజేశారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా 'ది వరల్డ్ తిపిటక: సజ్జాయ ఫొనెటిక్ ఎడిషన్' పేరు గల బౌద్ధ గ్రంథాన్ని మోదీకి బహుకరించారు. ఈ చర్య భారత్, థాయ్‌లాండ్ మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన, మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

వివరాలు 2లో..

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు ఏవోకు మెయిల్ ద్వారా బెదిరింపు
- పోలీసులకు సమాచారం అందించిన అధికారులు
- అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదన్న పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు ఏవోకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు అందాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం




వివరాలు 2లో..

## ట్రంప్ సుంకాలు భారత్ ఆర్థిక వ్యవస్థను నాశనం

- ట్రంప్ విధించిన సుంకాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి: రాహుల్ గాంధీ
- అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్న రాహుల్ గాంధీ
- కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన అనురాగ్ ఠాకూర్



వివరాలు 2లో..

## ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు



- భారత్ ఏఐకి త్వరగా అలవాటు పడిందన్న శామ్ ఆల్ట్‌మన్
- భారతీయుల క్రియేటివిటీపైనా ప్రశంసలు
- ఏపీలో ఏఐ అభివృద్ధికి గల అవకాశాలను అన్వేషించాలన్న చంద్రబాబు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిగ్గజ సంస్థ ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను అమరావతికి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా కోరారు. భారతదేశం ఏఐకి త్వరగా అలవాటుపడిందని, భారతీయుల సృజనాత్మకత అద్భుతమని ఆల్ట్‌మన్ చేసిన ట్వీట్ కు చంద్రబాబు స్పందించారు. ఈ మేరకు ఆయనను ఏపీకి ఆహ్వానించారు. ఏఐలో భారత్ దూసుకుపోతోందని

వివరాలు 2లో..

## సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

- వివేకా హత్య కేసులోని నిందితులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారన్న షర్మిల
- అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని వ్యాఖ్య
- హత్య జరిగినప్పుడు అక్కడ అవినాశ్ రెడ్డి ఉన్నారన్న షర్మిల




**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి బెయిల్ పై బయట ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని అన్నారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

# పరిటాల రవి హత్యలో జగన్ పాత్ర కూడా ఉంది

- మొదటి పేజి తరువాయి
గురించి మాట్లాడుతున్న వారు కారు బాంబు గురించి కూడా మాట్లాడాలని వ్యాఖ్యానించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 45 మందిని హత్యకు గురయ్యారని ఆరోపించారు. రాప్తాడులో తోపుదుర్తి సోదరులు ముఠా కక్షలను రెచ్చగొడుతున్నారని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబుల్ రెడ్డి, మద్దెలచెరువు సూరి కుటుంబాలను ఫ్యాక్షనిజంలోకి లాగుతున్నారని విమర్శించారు. "తోపుదుర్తి సోదరుల మాటలు నమ్మి ఈ కుట్రలో భాగస్వామ్యం కావొద్దని కనుముక్కల ఉమ, గంగుల భానుమతికి విజ్ఞప్తి చేస్తున్నా... ఇప్పటికే మన మూడు కుటుంబాలు ఫ్యాక్షన్ కారణంగా చాలా నష్టపోయాయి. మనం కోలుకోవడానికి చాలా సమయం పట్టింది... ఇప్పుడు మళ్లీ తోపుదుర్తి సోదరులు ఫ్యాక్షన్ ఉచ్చులోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారు. తోపుదుర్తి సోదరులు ఏం చెప్పినా జగన్ నమ్మేస్తున్నారు... ఐదేళ్లు సీఎంగా పనిచేసిన మీరు నిజానిజాలు తెలుసుకోరా? జగన్ శుక్రవారం నాడు పాపిరెడ్డిపల్లి గ్రామానికి వస్తానంటున్నారు... ఆయనకు శుక్రవారం కలిసొచ్చిందేమో! వచ్చేటప్పుడు జగన్ తన సూట్ కేసులో కాస్త దుస్తులు ఎక్కువగా తెచ్చుకుంటే బాగుంటుంది... లింగమయ్య కుటుంబాన్నే కాదు, మీ పార్టీ వల్ల నష్టపోయిన వారి కుటుంబాలను కూడా పరామర్శించాలి కదా! ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఫ్యాక్షన్ చిచ్చు పెట్టవద్దని జగన్ కు స్పష్టం చేస్తున్నా" అంటూ పరిటాల సునీత పేర్కొన్నారు.

## ఎడిటర్ వ్యూ

## ట్రంప్ అన్నంత పనిచేశారుగా...

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ వంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని పలు సందర్భాల్లో హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు. అమెరికా దేశ భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని మరోసారి నొక్కి చెప్పారు. భారత్ సహా ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నాని, ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు ట్రంప్ తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ఇక తాము 26 శాతం మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ప్రస్తావిస్తూ మోదీ తనకు గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదన్నారు. అమెరికాపై 52 శాతం మేర సుంకాలు విధిస్తోందని మరోసారి గుర్తు చేశారు. మరోవైపు.. చైనాపై 34 శాతం మేర సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం సుంకాలు ఉంటాయని ప్రకటించారు. ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఫార్మా, వ్యవసాయం, రసాయనాలు, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్, మెషినరీ వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. వియత్నాం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏకంగా 46 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు ట్రంప్. స్విట్జర్లాండ్‌పై 31 శాతం, తైవాన్ పై 32 శాతం, బ్రిటన్ పై 10 శాతం, బ్రెజిల్ పై 10 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, సింగపూర్‌పై 10 శాతం, దక్షిణాఫ్రికాపై 30 శాతం మేర ప్రతీకార సుంకాలు ప్రకటించారు. భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది కూడా దాదాపు 18 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ఈ సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ఈ దిగుమతుల ధరలు పెరిగి, అమెరికా మార్కెట్‌లో వాటి పోటీదనాన్ని తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ క్రింది రంగాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించవచ్చు. భారతదేశం ప్రపంచానికి ప్రధానంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా ఉంది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఔషధ కంపెనీలు గొప్ప స్థాయిలో పోటీ చేస్తున్నాయి. అయితే 26% సుంకం వల్ల ఈ ఉత్పత్తుల ఖర్చులు పెరిగి, వాటి ధరలు ఎక్కువయ్యే అవకాశముంది. ఫలితంగా, అమెరికాలో భారత ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చు. భారతదేశం అమెరికాకు భారీగా వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. భారతీయ కాటన్, రేష్మి, ఇతర వస్త్ర ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే, సుంకాల కారణంగా ధరలు పెరిగితే, ఇతర దేశాల పోటీ పెరిగి, భారత వస్త్ర వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెద్ద మొత్తంలో ఆటో విడిభాగాలను ఎగుమతి చేస్తోంది. ఈ కొత్త సుంకాలు భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రభావితం చేసి, అమెరికాలో భారతీయ ఆటో భాగాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల భారతదేశ ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెట్రోలియం ఉత్పత్తులు, రసాయన పదార్థాలు కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈ సుంకాల వల్ల, ఈ ఉత్పత్తులపై ఖర్చు పెరిగి, వాటి ఎగుమతికి ఆటంకం కలిగే అవకాశం ఉంది, భారతదేశం నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటీ సంబంధిత హార్డ్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే చైనా వంటి దేశాలతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పుడు సుంకాల కారణంగా, భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పోటీదనం మరింత తగ్గే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది ఎగుమతి అయ్యే ఉత్పత్తులు గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 17-18% ఉంటుంది. అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 17-18% వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు. ఈ ఉత్పత్తుల్లో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటాయి. దీంతో అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. ఆ తర్వాత యూఏఈ, చైనా వంటి దేశాలు ఉన్నాయి. ఇక భారతదేశం విదేశాల నుంచి దిగుమతులు చేసుకునే వస్తువుల్లో అమెరికా కీలకమైన భాగస్వామిగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, భారత్ మొత్తం దిగుమతుల విలువ సుమారు 732 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా నుంచి దిగుమతులు 42.12 బిలియన్ డాలర్లు, అంటే సుమారు 5.75%. అంటే, ప్రతి ఏడాది భారత్ దిగుమతులలో అమెరికా వాటా సుమారు 5-6%గా ఉంటుందిభారతదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ప్రధాన వస్తువులలో క్రూడ్ పెట్రోలియం (ముడి చమురు), బొగ్గు ఉత్పత్తులు (కోల్ బ్రికెట్స్) ,గ్యాస్ టర్బైన్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అమెరికా భారత్‌కు ముఖ్యమైన వ్యాపార భాగస్వామిగా ఉన్నప్పటికీ, చైనా (17%), రష్యా (9%) పెద్ద వాటా కలిగి ఉండటం విశేషం. అయినప్పటికీ, అమెరికా నుంచి వచ్చే టెక్నాలజీ ఉత్పత్తులు, ఖరీదైన రత్నాలు, ఇంధన వనరులు భారత మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

# మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు

- మొదటి పేజి తరువాయి
మిథున్ రెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై మార్చి 24న హైకోర్టులో వాదనలు జరిగాయి. తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు... మార్చి 3న తీర్పును వెలువరిస్తామని... అప్పటి వరకు మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. ఈరోజు మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. వాదనల సందర్భంగా సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ... ఈ కేసులో మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, ఆయనకు నోటీసులు ఇవ్వలేదని, విచారణకు హాజరు కావాలని ఆదేశించలేదని కోర్టుకు తెలిపారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేనప్పుడు బెయిల్ కోరడానికి వీల్లేదని చెప్పారు.

# ట్రంప్ సుంకాలు భారత్ ఆర్థిక వ్యవస్థను నాశనం

**పెన్ పవర్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, అమెరికా సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోబోతుందో స్పష్టం చేయాలన ఆయన కోరారు.
ఈ సందర్భంగా రాహుల్ గాంధీ భారత్-చైనా సరిహద్దు వివాదాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చైనా మన దేశానికి చెందిన 4 వేల కిలోమీటర్లకు పైగా భూభాగాన్ని ఆక్రమించిందని, దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసిందని ఆయన అన్నారు. ఆక్రమిత భూభాగాన్ని త్వరగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం అక్కడి రాయబారి ద్వారా వెలుగులోకి వచ్చిందని తెలిపారు.
రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు
బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ప్రతిస్పందించారు. ఏ ప్రభుత్వ హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసని అన్నారు. డోక్లాం ఘటన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి ఎవరు సూప్ తాగారో కూడా తెలుసని ఠాకూర్ విమర్శించారు. ఇలాంటి అంశాలను రాజకీయం చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని, గతంలో జరిగిన తప్పిదాలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని నిలదీశారు.

# సునీతను ఏమైనా చేస్తారనే భయం నాలో ఉంది

- మొదటి పేజి తరువాయి
వివేకా కూతురు సునీత ప్రాణాలకు కూడా రక్షణ లేదని షర్మిల అన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం తమలో ఉందని చెప్పారు. ఇటీవల తనకు కొన్ని విషయాలు తెలిశాయని... అవి తనను ఆలోచింపజేస్తున్నాయని అన్నారు. సునీతకు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ లో పలు విషయాలను పేర్కొందని షర్మిల తెలిపారు. విచారణ అధికారులను అవినాశ్ పిలిపించుకుని బెదిరించినట్టు అఫిడవిట్ లో ఉందని... తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాశ్ సంతకాలు చేయించినట్టు ఉందని చెప్పారు. అవినాశ్ బెయిల్ పై ఉండటం వల్లే సునీతకు న్యాయం జరగడం లేదని అన్నారు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించినట్టు తప్పుడు రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హత్య జరిగినప్పుడు ఘటనాస్థలిలో ఉన్నది అవవినాశ్ రెడ్డేనని చెప్పారు.

# థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

- మొదటి పేజి తరువాయి
'తిపిటక' అంటే పాలీ భాషలో 'మూడు బుట్టలు'. ఇది బౌద్ధ ధర్మ గ్రంథాలలో ప్రధానమైనది. ఇందులో బౌద్ధ సన్యాసుల నియమాలు, సూత్రాలు, బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈ గ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది.
థాయ్ ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్ (రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో 'వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్'లో భాగంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ లిపులలో రూపొందించబడిన ఈ గ్రంథం, తొమ్మిది మిలియన్లకు పైగా పదాలను కలిగి ఉంది. అంతేకాకుండా, ఇది కచ్చితమైన ఉచ్చారణతో పఠించేందుకు వీలుగా రూపొందించబడింది. కానుక అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ, "ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారు. లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారతదేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించాను. గత సంవత్సరం, భారతదేశం లార్డ్ బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధాన మతగురువులను థాయ్‌లాండ్‌కు పంపింది. దాదాపు నాలుగు మిలియన్ల మంది ప్రజలు ఆ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.
థాయ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, థాయ్‌లాండ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా ఉండటంతో పాటు, తిపిటకను ఇతర దేశాలకు వ్యాప్తి చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

# మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- మొదటి పేజి తరువాయి
అందించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో కలెక్టరేట్ ఆవరణలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.
అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మరోవైపు, బెదిరింపులు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# విచారణకు డుమ్మా కొట్టిన కాకాణి గోవర్ధన్

- మొదటి పేజి తరువాయి
పోలీసులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. గతంలో కూడా ఓ కేసులో ఇలాగే తప్పించుకు తిరిగినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న కాకాణి... చివరకు సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.

# హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలు...

**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వులపై బీజేపీ నేత, మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు స్పందించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల విషయంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే ఈ కోర్టు ఆదేశాలు వెలువడ్డాయని రఘునందన్ రావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ భూముల పరిరక్షణ కోసం తాము సైతం పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఒక్క చెట్టును కొట్టివేయలన్నా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, అలాంటిది వందల సంఖ్యలో చెట్లను కొట్టివేస్తే ఎలా? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. తమను ఎవరూ ఏమీ చేయలేరని భావించిన ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు చెంపదెబ్బలాంటివని అభివర్ణించారు.

# ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి
శామ్ ఆల్ట్ మన్ చేసిన వ్యాఖ్యల పట్ల చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏఐ అభివృద్ధికి కేంద్రంగా మార్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. "మీరు చెప్పింది అక్షరాలా నిజం! భారతదేశం తన ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ ఆధారిత అభివృద్ధికి కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉంది. మీ తదుపరి భారత పర్యటనలో మిమ్మల్ని అమరావతికి ఆహ్వానించడం నాకు సంతోషంగా ఉంది. భవిష్యత్తును రూపొందించడంలో మా విజన్‌ను మీతో పంచుకుంటాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.
రాష్ట్రం ఏఐతో పాటు క్వాంటం టెక్నాలజీలో కూడా ముందంజలో ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని, ఓపెన్ ఏఐతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉందని తెలిపారు.


# ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు 'పట్టా'భిషేకం

- మొదటి పేజి తరువాయి
ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రేపు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

- మొదటి పేజి తరువాయి
ఈ వివాదాస్పద బిల్లుపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో టీవీకే పార్టీ కూడా తన వైఖరి వెల్లడించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టేందుకు టీవీకే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా నిరసనలను సమర్థవంతంగా నిర్వహించాలని అధినేత విజయ్ తన పార్టీ జిల్లా కార్యదర్శులకు సూచించారు. వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. లోక్‌సభలో బిల్లుకు అనుకూలంగా 288 మంది సభ్యులు ఓటు వేయగా, 232 మంది వ్యతిరేకించారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ, ప్రతిపాదించిన సవరణలన్నీ వాయిస్ ఓటు ద్వారా తిరస్కరించబడ్డాయి. ఎన్డీయే ఈ బిల్లు మైనారిటీ వర్గాలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రూపొందించామని సమర్థించుకుంది. అయితే ప్రతిపక్ష పార్టీలు దీనిని 'ముస్లిం వ్యతిరేకం' అని విమర్శించాయి. ప్రభుత్వం లౌకిక విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించాయి. భారతదేశంలో మైనారిటీలు మెరుగైన రక్షణ లభిస్తోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వాదించారు. "ప్రపంచంలో భారతదేశం కంటే సురక్షితమైన ప్రదేశం మైనారిటీలకు మరొకటి లేదు. భారతదేశంలో మెజారిటీ ప్రజలు పూర్తిగా లౌకికవాదులు కాబట్టి, మైనారిటీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ పొందుతున్నారు" అని మంత్రి రిజిజు చర్చ సందర్భంగా అన్నారు.

పెన్ పవర్
ప్రకాశం




# ఎనీ టైం కిక్కు..!

**వేకువజామునే తెరుచుకుంటున్న మద్యం దుకాణాలు**
**తెల్లవార్లు అమ్మకాలు.**
**వాహనాల్లో వచ్చి 10 అదనంగా వసూలు చేసి మరీ బట్టీకొట్లకు వేస్తున్న వైనం.**
**చేష్టలుడిగి చూస్తున్న ఎక్సైజ్ శాఖ**





వలేటివారిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 3

జఎప్పుడైనా తాగండి.. ఎంతైనా తాగండి.. తెల్లవార్లూ మీకోసమే అమ్మకాలు అని కొత్తరాగం అందుకున్నట్లు ఉంది కందుకూరు ఎక్సైజ్ శాఖ.. తెల్లారింది మొదలు అర్ధరాత్రి దాకా మద్యం అందు బాటులో ఉంటోందక్కడ. వ్యాపారులు తమ లాభాలకోసం చేస్తున్నారంటే అర్థం ఉంది.. మరి ఎక్సైజ్ అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారు అనేది కదా ప్రశ్న. ప్రభుత్వనియమ నిబంధనలు అమలు చేయాల్సిన యంత్రాంగం ఏ తాయలానికి ఆశ పడింది అన్న చర్చ స్థానిక వలేటివారిపాలెం మండలంలో జోరుగా సాగుతోంది మద్యం షాపులు అసలు సమయ పాలన పాటించడం లేదు. మద్యం ప్రియులకు ఏ సమయంలోనైనా అమ్మేం దుకు వైన్ షాప్ యజమా నులు ఏర్పాట్లు చేశారు. రేషన్ బియ్యం ఇంటికి సరఫరా చేసినట్లు ప్రతి గ్రామంలో ప్రతి దుకాణానికి మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో మరి దారుణంగా ఉదయాన్నే టీ స్టాళ్లు తెరిచినట్టు తెల్లవారుజామున 4 గంటలకే వైన్స్ ఏం దుకాణంలో పట్టినా అదే. టీ స్టాల్ కంటే ముందు ప్రతి గ్రామంలో ఓపెన్ అయిపోతున్నాయి. అర్ధరాత్రి రెండో ఆట సినిమా వదిలే వరకు ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు. మరీ అతి పనికి రాదనుకున్నారో ఏమో కానీ అర్ధరాత్రి షాపులు కట్టేస్తున్నారు. ఏదోకటి కాసేపు మూస్తున్నారు కదా అని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. మద్యం దుకాణాలకు అనుబంధంగా ఇంకో షాపు కిరాయికి తీసుకుని అక్కడా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. అడిగితే అధికార పార్టీ నాయకులు పేర్లు చెబుతున్నారు. ఇది పూర్తి బహిరంగ రహస్యమే. ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ శాఖ ఆ మద్యం మత్తులో మునిగి తేలుతున్నారేమో కానీ, నియంత్రించాలన్న ఆలోచన కూడా చేయడం లేదని విమర్శలున్నాయి. ప్రభుత్వం సీరియస్ గా పరిగణించే అంశాల్లో అతి ముఖ్యమైనది సుంకం ఎగవేసిన మద్యం అమ్మకాల్ని. దీన్నే యండీపీయల్ ( నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) అంటారు. ఒకరకంగా అసలును పోలిన డూప్లికేట్ మద్యం అన్నమాట. ఇలాంటి మద్యం వలేటివారిపాలెం మండలంలో విచ్చలవిడిగా అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అటు ఎక్సైజ్ శాఖ కు, ఇటు పోలీసులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఎనీ టైం కిక్కు తో వ్యశనపరులు ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి.పాటించాల్సిన ఏ నిభందనా అమలు పరచని పరిస్థితి . మొత్తంలో ఒక " వలేటివారిపాలెం మండలంలో కనిపిస్తుంది. వైన్ షాపుల్లో సీల్ చేసిన బాటిళ్లను మాత్రమే అమ్మాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా పెగ్గులు, నైంటీలు అమ్మేస్తున్నారని కూడా మందు బాబులు చెప్పుకుంటున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం అయినా ఇదెలా సాధ్యం అవుతుందో మందు బాబులకు అర్థం కాని పరిస్థితి. అలాగే ఎంఆర్పీమీద రూ. 10అదనం చేసి బెల్టు షాపులకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎక్సైజ్ సిబ్బంది చేతులెత్తేసిన క్రమంలో ఉన్నతాధికారులు రంగప్రవేశం చేస్తే తప్ప ఈ అక్రమ దందాకు తెర పడదని వలేటివారిపాలెం మండలంలో ప్రజానికం అంటోంది.

# ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

*మేల్కొని కేకలు వేసిన మహిళ.*
*అప్పటికే బంగారు గొలుసుతో పరారైన దొంగలు.*
*కొమరోలు మండలం బాలిరెడ్డి పల్లె లో సంఘటన.*



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

రాత్రివేళ ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు అపరించుకు వెళ్లిన సంఘటన కొమరోలు మండలం బాలిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఆ గ్రామానికి చెందిన ఒక మహిళ రోజు వలె బంగారు గొలుసు ధరిస్తూ ఉండేది. కాగా ఇటీవల ఉక్క పోతను భరించలేక ప్రజలు ఆరు బయట నిద్రిస్తున్నారు. రాత్రి వేళల్లో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతూ ప్రజలకు నిద్ర భంగం కలిగిస్తున్నది. దీనితో గ్రామీణ ప్రజలు రాత్రి వేళల్లో ఇంటి బయట మంచాలు వేసుకుని నిద్రిస్తున్నారు. మరికొందరు ఇంటి డాబాలపై నిద్రిస్తున్నారు. బాలిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఒక మహిళ బుధవారం రాత్రి తమ ఇంటి బయట మంచం వేసుకొని నిద్రించింది అయితే అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దీనితో ఆమె మేల్కొని కేకలు వేయగా ,కుటుంబ సభ్యులు కూడా మేల్కొని దొంగల కోసం గాలించారు. అయితే దొంగలు అప్పటికే పారిపోయారని ఆ గ్రామస్తులు తెలిపారు. దొంగలు లాక్కెళ్ళి న బంగారు గొలుసు రెండు తులాలు ఉంటుందని, దీనితో తమకు దాదాపు లక్షా ఎనభై వేల రూపాయల వరకు నష్టం వాటిలిందని బాధితురాలు తెలిపినట్టుగా గ్రామస్తులు చెప్పారు. జరిగిన సంఘటనపై 100 నెంబర్ కు డయల్ చేసి సమాచారం వివరించామని ఆ గ్రామస్తులు తెలిపారు.



# ప్లాస్టిక్ రహిత గిద్దలూరును తీర్చి దిద్దుతాం??

**ఇది ఉపన్యాసాలకేనా ?**
**స్వచాంధ్ర నిర్వహణ కార్యక్రమాలు ఫొటలకే పరిమితమా?**
**-ప్రజల్లో చైతన్యం ఎక్కడ?**
**ఏ డ్రైనేజి కాలువలో చూసినా ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ కవర్లే !!**
**వాటిని తొలగించేందుకు**
**ఇబ్బందులు పడుతున్న పారిశుధ్య కార్మికులు**



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

స్వచాంధ్ర కార్యక్రమం కేవలం ఒక్క కార్యక్రమంగా తూ తూ మంత్రంగా నిర్వహిస్తున్నారు తప్ప ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి డ్రైనేజిలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చేయాలి కానీ ఆదిశగా సంభదిత అధికారులు ఏ మాత్రం చర్యలు లేవు . ప్లాస్టిక్ ,రహిత పట్టణంగా తీర్చి దిద్దుతామని ప్రతిజ్ఞలు చేస్తారు కానీ మరుసటి రోజా దాన్ని గురించి పట్టించుకోరు. ఇప్పటి వాటర్ బాటిల్స్ డిస్పోజల్ కాఫీ కప్పులు, మద్యం త్రాగేందుకు వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులు డ్రైనేజీలోనే వేస్తుంటారు. ఇప్పటికి పలు షాపుల్లో ప్లాస్టిక్ గ్లాసులవినియోగం కొనసాగుతూనేఉంది. ప్లాస్టిక్ గ్లాసులవినియోగం, కొనసాగుతూనే ఉంది. కొన్ని మద్యం బాటిళ్లు కూడా ప్లాస్టిక్ సీసాలోనే వస్తున్నాయి. టీ స్టాల్ లలో డిస్పోజల్ గ్లాసులు వాడుతున్నారు. వీటిపై అధికారు దాడులు నిర్వహించి కట్టుదిట్టం చేయాల్సి ఉంది , తూ తూ మంత్రంగా సాగాల్సిన ప్రక్రియ సాగదు. కాకుండా ప్రజల్లో కూడా చైతన్యం లేదు ఏదీ పడితే అది డ్రైనేజి లో వేయటం అలవాటైపోయింది. చెత్త చెదారం డ్రైనేజి లోనే వేస్తుంటారు . అవ్యర్థాలు పేరుకుపోయి మురికినీటి ప్రవాహానికి అడ్డుపడి నీరు రోడ్లపై కి చేరుతుంది. ప్రజలు కూడా శానిటేషన్ కు అధికారులకు, పారిశుధ్య కార్మికులు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది . ప్రతి రోజు చెత్త సేకరించే కార్మికులు ఒక బండితో వచ్చి ఇంటిలో ఉన్న వారిని పిలిచి పిలిచి , తడి పొడి , చెత్తను సేకరిస్తాను , కానీ ఆసమయంలో నిద్ర లెవటం బద్ధకం , దీంతో చెత్తను తీరిగ్గా నిద్రలేచి ద్రనేజీల్లో వేస్తుంటారు. ఫలితంగా డ్రైనేజి లు చెత్తచ్చేదారం తో నిండిపోతున్నాయి. ప్రజలు ఈ విధానానికి స్వస్తి పలకాల్సివుంది. కానీ ఎంత మంది పాటిస్తున్నారు. ఒక్కో చోటా పారిశుధ్య కార్మికులు కాలువలను శుభ్రం చేస్తుంటే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతరత్రా చెత్త చెదారం బయటపడుతుంది . దీన్ని కష్టపడి కార్మికులు తీస్తుంటారు. వారు కూడా మనుషులే అనే భావాన కొరవడటమే ప్రధాన కారణం అనేక తప్పదు. ఇక కొంతమంది నెలల తరబడి కాలువల శుభ్రం చేయలేదని వాపోతుంటారు, కాలువల్లో వ్యర్థ కాళీ ప్లాస్టిక్ సీసాలు , ఇతరత్రా చెత్తాచెదారాలను కొబ్బరి బొండాలను, వేయవద్దని చైతన్యం తీసుకు రారు. పారిశుధ్య కార్మికుల అవస్థలను కూడా అర్థం చేసుకోవాలి గాద యని చెప్పరు, ప్రధానంగా డ్రైనేజి లో ప్లాస్టిక్ , ఇతర చెత్తా చెదారాలు, నీటి ప్రవాహానికి అడ్డుపడే వ్యర్థాలు వేయకుండా ప్రజాల్లోనే చైతన్యం రావాలి. ప్లాసిక్ క్యారి బాగులు, గ్లాసుల విక్రయ దారులపై దాడులు ముమ్మారం చేయాలి , అవసరమైతే జరిమానాలు విధించాలి కాకుండా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రచారకార్యక్రంమాలు నిర్వహించాలి . అప్పుడే డ్రైనేజి లు శుభ్రంగా ఉంటాయి. ప్రధానంగా ప్రజలు చైతన్య మై డ్రైనేజీలో చెత్తా చెదారాలు వెకుండా ఉండాలి. పన్నులు కాడుతున్నాం కదా ఇది సంభందించిన అధికారుల, పారిశుధ్య కార్మికుల భాద్యత అనుకోవటం సమంజసం కాదని నిపుణులు చెపుతున్నారు.

# లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

*- జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా*





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03**

బిసి., ఈబీసీ కాపు యాక్షన్ ప్లాన్ కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు ఆర్థిక తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, బ్యాంకర్లను కోరారు. గురువారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, బిసి కార్పోరేషన్ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమై, బిసి కార్పోరేషన్ ద్వారా బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేసిన వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ పురోగతి పై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద 1,864 యూనిట్స్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా లోని వివిధ బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెల 9వ తేదీ లోపు సుమారు వెయ్యి యూనిట్స్ గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బ్యాంకర్ల ను ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన జరిగే మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి రోజున సంబంధిత లబ్దిదారులకు యూనిట్స్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బిసి కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా పేద వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతిబ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు పథకాలు మంజూరు చేసి, గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర రావు, ఎల్.డి.ఎం రమేష్, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ గీతను శుభాకాంక్షలు తెలిపిన గునుపూడి, జిలాని





**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 3**

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మెంబర్ నియమితులైన స్థానిక ప్రముఖ మహిళా డాక్టర్ స్వర్ణ గీతను పలువురు అభినందిస్తున్నారు అలాగే గురువారం నాడు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష స్థానిక గీతా నర్సింగ్ హోమ్ లోని డాక్టర్ స్వర్ణ గీతను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు ముందుగా వారు డాక్టర్ గీతను శాలువలు, పూలదండ లు, పుష్పగుచ్చాలతో సత్కరించారు డాక్టర్ గీత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని, ప్రజలు, పేద వర్గాలకు విస్తృతంగా వైద్య సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

# పొదిలిలో ప్రభుత్వ న్యాయవాది షబ్బీర్‌ని సన్మానించిన కరీముల్లా బేగ్



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 3**

పొదిలిలో గురువారం నాడు ప్రభుత్వ న్యాయవాది షేక్ షబ్బీర్ ను హబీబుల్లాబి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ ఘనంగా సన్మానించారు షబ్బీర్ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హబీబుల్లా బేగ్ షబ్బీర్ కార్యాలయంలో ప్రభుత్వ న్యాయవాది షబ్బీర్ ను శాలువా, పూలదండతో సన్మానిం చి, స్వీట్స్ ప్యాకెట్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ముల్లా మదార్ వలి, ముల్లా ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ గాజాలపై వైమానిక దాడులుఆపాలి

**- సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు**




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 03**

అంతర్జాతీయ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఐక్యరాజ్యసమితి మాటను లెక్కచేయక ఇజ్రాయిల్ యుద్ధంన్మాదంతో భూతల దాడులతో విరుచుకుపడుతూ బరితెగింపు ప్రకటనకు దిగందని, ఇప్పటి వరకు 17 శాతం భూభాగాన్ని ఆక్రమించుకుందని, భూతల దాడులను మరింతగా విస్తరింపజేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్ట్ బరితెగింపు ప్రకటనలు చేయడాని సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఒంగోలు నగరంలోని గాంధీనగర్ సెంటర్ నందు తంబి శ్రీనివాసరావు అధ్యక్షతన గాజపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బఫర్ జోన్లకు కలిపేందుకు పెద్ద మొత్తంలో భూ భాగాన్ని స్వాధీనం చేసుకోనున్నట్లు కూడా వారు తెలపడం,ఇది ముమ్మాటికి దురాక్రమణ చర్య అని వారు దుయ్యబట్టారు. తక్షణమే గాజపై ఇజ్రాయిల్ దాడి ఆపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సీనియర్ నాయకులు యస్. డి. యాసిన్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్ ఒంగోలు నగర నాయకులు ఈ టి.మహేష్ , బి. వి. రావు పీరుషాహెబ్. టి. సురేష్ రావూరీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# తొలకరి జల్లులను తలపించిన చిరుజల్లులు

**గురువారం మధ్యాహ్నం మారిన వాతావరణం -ఉరుములు మెరుపులతో కురిసిన చిరుజల్లులు**

**పిడుగులు తలుచుకుంటూ భయాందోళన చెందిన ప్రజలు -అకాల వర్షాలు అనర్థాలకు మూలం అంటున్న రైతులు**





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

కొమరోలులో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి తొలకరి జల్లులను తలపిస్తూ చిరుజల్లు కురిసాయి. గత రెండు మాసాలుగా పగలు ఎండలు తీవ్రంగా కాస్తుండగా, వడగాడుపులు కూడా వీస్తున్నాయి. ఇక అర్ధరాత్రి వరకు కూడా వడగాడుపులు ఇస్తున్నందువల్ల పేద ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతూ నిద్రకు దూరమవుతున్నారు కాగా, గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పు కనిపించింది .ఆకాశం మేఘాలతో నిండి ,ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుందా ?అన్నట్లుగా వాతావరణం మారిపోయింది. అయితే ఆ తర్వాత కొద్దిసేపటికి ఉరుములు మెరుపులతో ఆకాశం నిండిపోయి చిరుజల్లులు కురిసాయి. కేవలం సిమెంట్ రోడ్లు తడిచే విధంగా మాత్రమే జల్లులు కురిసాయి. రోడ్లకు ఇరువైపుల గల మార్జిన్లు కూడా తడవకపోవడంతో కురిసిన చిరుజల్లులతో ప్రజలు నిరాశ చెందారు. ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురయ్యింది .అయితే ఆకాశం ఉరుములు మెరుపులతో నిండి పోవడంతో ప్రజలు పిడుగులు తలుచుకుంటూ భయాందోళన చెందారు . కాగా పెనుగాలులు వేయకపోవడంతో ప్రజలు కొంత ఊరట చెందారు . ఉరుముల మెరుపులకు భయపడి పొలాల్లో ఉన్న కూలీలు పరుగు పరుగున ఇళ్లకు చేరుకున్నారు. అకాల వర్షాల వల్ల అనర్థాలు తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు.

# బంగారు ,వెండి ఆభరణాలు ధరించి రాత్రి వేళల్లో ఆరు బయట నిద్రించవద్దు

**ఇళ్లకు తాళాలు వేసి ఆరుబయట, డాబాలపైన నిద్రించేవారు అప్పుడప్పుడు ఇంటిని పరిశీలిస్తూ ఉండాలి.**

**అపరచిత వ్యక్తుల సంచారాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాలి.**

**ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇళ్లలో విలువైన ఆభరణాలు, నగదును ఉంచరాదు.**

**కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు.**




**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

విలువైన బంగారు ,వెండి ఆభరణాలు ధరించి రాత్రి వేళల్లో ఆరు బయట నిద్రించకూడదని కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు ప్రజలకు సూచనలు సలహాలు ఇచ్చారు. వేసవికాలంలో ఉక్కపోత అధికంగా ఉంటున్నందువల్ల ప్రజలు రాత్రి వేళల్లో ఇళ్లలో నిద్రించలేక ఇళ్ల బయట డాబాలపై నిద్రిస్తూ ఉంటారని ఆయన చెప్పారు. చాలామంది మహిళలు పగలు ధరించిన విలువైన బంగారు, వెండి ఆభరణాలను అలాగే ఉంచుకొని రాత్రి వేళల్లో ఆరుబయట నిద్రిస్తుంటారని అలాంటి వారిని దొంగలు లక్ష్యంగా చేసుకొని, పసిగట్టి మహిళల మేడలలో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లే ప్రమాదం ఉన్నదని ఆయన తెలిపారు .అందువల్ల ప్రజలు బంగారు వెండి ఆభరణాలను ధరించి రాత్రి వేళల్లో ఆరు బయట నిద్రించవద్దని ఆయన సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి ఆరు బయట లేదా డాబాలపై నిద్రించేవారు అప్పుడప్పుడు మేల్కొని తమ ఇంటిని పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. దీనితో దొంగల నుంచి తమ ఇళ్ళను కాపాడుకోవచ్చు అని చెప్పారు. గ్రామాలలో పగలు అపరిచిత వ్యక్తుల సంచారాన్ని గుర్తించి తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు .ఇక ఇళ్లకు తాళాలు వేసి దూరప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇళ్లలో విలువైన ఆభరణాలు, నగదును ఉంచవద్దని, అంతేకాక దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇరువుపరుగు వారికి సమాచారం అందించి వెళ్లారన్నారు. కొమరోలు పట్టణం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నదని, అయినప్పటికీ కొమరోలు పట్టణంలో నివసించే ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లే సందర్భంలో సమాచారాన్ని పోలీస్ స్టేషన్లో తెలియజేసి వెళ్లాలన్నారు. బాలిరెడ్డి పల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన సంఘటన కొత్త వ్యక్తులు చేసిన పనా? లేక ఆ గ్రామంలోని ఆగతాయిలు చేసిన దోపిడీనా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై నాగరాజు తెలిపారు.

# భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అందరూ గట్టి కృషి చేయాలి

**జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి**



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 3**

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతానికి అందరూ గట్టి కృషి చేయాలని జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి కోరారు గురువారం నాడు పట్టణంలోని బెల్లంకొండ నగర్ లో గల బిజెపి మండల కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని శక్తిగా రూపొందించే విధంగా నాయకులు కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలన్నారు రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఈనెల ఆరవ తేదీన బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆమె చెప్పారు అలాగే పార్టీ అభివృద్ధి కోసం అవసరమైన చర్యల గురించి ఆమె సమావేశంలో వివరించారు అనంతరం భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, భావాలు కు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు ముందుకొచ్చిన షేక్ మహమ్మద్ అనే యువకుడిని ఆమె పార్టీ కండువా కప్పి, సాదరంగా ఆహ్వానించారు కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, పట్టణ శాఖ బిజెపి అధ్యక్షులు యుద్ధం మహేష్, నాయకులు ఎస్ శ్రీనివాసరెడ్డి, పి నారాయణ, జిల్లా బిజెపి కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మాకినేని ప్రతాపసింహ, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష, షేక్ రఫీ, వెంకట్, అంజి, భా తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారాకు వినియోగించే బెల్లం ఊట, సారబట్టి ధ్వంసం వ్యకి అరెస్టు



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

గిద్దలూరు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఎక్సైజ్ నేరం ల కొరకు గాలింపు నిర్వహించుచుండగా గురువారం బురుజుపల్లి గ్రామం పరిధిలో ఒక నాటు సారా బట్టిని గుర్తించి 100 లీటర్ల బెల్లపు ఊటను, బట్టి సామాగ్రిని ధ్వంసం చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. ఈ సందర్భంగా నాటు సారా తయారు చేయడం రవాణా చేయడం అమ్మడం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ గృహ విషయం చట్టం ప్రకారం నేరం కావున ప్రజలు ఇలాంటి నేరాలకు పాల్పడే వారి సమాచారాన్ని ఫోన్ నెంబర్ 9450902507 కు సమాచారాన్ని తెలపాల్సిందిగా కోరారు. ఈ దాడుల్లో గిద్దలూరు ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం. జయరావు, హెడ్ కానిస్టేబుల్ యూసఫ్ షరీఫ్ కానిస్టేబుల్ శ్రీపతి, రహంతుల్లా ,అసదుల్లా పాల్గొన్నారు.

# ముస్లింల నమ్మకాన్ని వమ్ముచేసిన ముఖ్యమంత్రి

**చంద్ర బాబు వైఖరిపై ముస్లిం ప్రజాసంఘాల ఐక్యవేదిక విచారం**


**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 03**

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించి తమకు బాసటగా నిలబడాలని ముస్లిం సామాజిక వర్గం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేసినప్పటికీ ముస్లింలపట్ల మరొకసారి వివక్ష పూరిత వైఖరిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రదర్శించారని ముస్లిం ప్రజాసంఘాల నాయకులు విచారాన్ని వ్యక్తం చేశారు. గతంలో ముస్లిం నవాబులు, ధనవంతులు ముస్లింల సంక్షేమం కోసం. ధార్మిక అవసరాలకోసం అల్లాహ్ పేరుతో దానం ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని కాపాడాలని దేశవ్యాప్తంగా ముస్లింలు ఉద్యమాలు చేస్తే దానికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం ఇందులో ఇరవై మందితో కమిటీ ఉంటే అందులో ముస్లింలు కేవలం ఎనిమిది మాత్రమే ముస్లింలు ఉండేలా మిగిలిన పన్నెండు మంది ఎవరైనా ఉండొచ్చు అనే విధంగా బిల్లు రూపకల్పన చేస్తే ఇది ముమ్మాటికీ ముస్లిం సమాజం అంగీకరించదని పేర్కొన్నారు. గతంలో ఎన్నికలకు ముందు ముస్లింలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన వాగ్దానం నమ్మి ఎన్ డి ఏ లో భాగస్వామ్యంలో ఉన్నా కూడా ముస్లింలు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి కూటమి గెలుపుకు కారణమైనప్పటికీ ఇప్పుడు ముస్లిం సమాజానికి తీవ్రమైన నష్టం చేయకూర్చే వక్ఫ్ సవరణ బిల్లు కు మద్దతు ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ముస్లింలు చంద్రబాబునాయుడు మీద ఆశలు పెట్టుకున్నారని బహిరంగ సభల ద్వారా, నిరసన కార్యక్రమాల ద్వారా, పోస్ట్ కార్డు ఉద్యమాల ద్వారా అనేక రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం లకు అండగా నిలబడాలనే ఆకాంక్షలు తెలియచేసినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోకుండా పార్లమెంటు సభ్యులకు విప్ జారీ చేసి మరీ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం తెలపడం ముస్లిం ప్రజానీకానికి తీరని నష్టం చేకూర్చుడంతో పాటు మతతత్వ రాజకీయాలకు వత్తాసు పలకడం బాధాకరమైన విషయమని అన్నారు. మన రాష్ట్ర పార్లమెంటు సభ్యులు అనుకూలంగా కాకుండా వ్యతిరేకంగా ఓటింగ్ వేసి ఉంటే బిల్లు ఆమోదం పొందేది కాదని రాష్ట్రంలో పదిశాతం ఉన్న ముస్లింల మనోభావాలను ముఖ్యమంత్రి పై ఉంచుకున్న నమ్మకాన్ని బేఖాతరు చేశారని ఇక ఎప్పటికీ ముస్లిం సమాజం చంద్రబాబునాయుడుని నమ్మే పరిస్థితి లేదని తెలియ చేసారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు సయ్యద్ సర్దార్, పఠాన్ కరిముల్లా ఖాన్, షేక్ మహ్మద్ రఫీ, షేక్ కరిముల్లా, సయ్యద్ ఇస్మాయిల్ ,షేక్ అబ్దుల్ రవూఫ్,షేక్ రహమాన్ తదితరులు చెప్పారు.

# గుండె పోటుతో పాస్టర్ మృతి

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 3**

గుండెపోటుతో పాస్టర్ మృతి చెందిన ఘటన పుల్లల చెరువు మండలంలో చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం.. పుల్లల చెరువు మండలం ఎస్సీ పాలెం నికి చెందిన వేము మాణిఖ్యరావు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. పాస్టర్ మాణిఖ్యరావుకు గురువారం ఉదయం గుండెలో నొప్పి రావడంతో ఆర్ ఎంపి డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లగా,పరిస్థితి విషమంగా ఉందని ఆర్ ఎంపి చెప్పడంతో హుటహుటిన వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.



# పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్









**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

పొన్నలూరు పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ దామోదర్ గురువారం నాడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవరించి సత్వరంగా వారికి న్యాయం జరిగే విధంగా చెయ్యాలని, పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి పొన్నలూరు మరియు కొండేపి పోలీస్ స్టేషన్ లను గురువారం జిల్లా ఎస్పీ గారు తనిఖీ చేసారు. ఈ తనిఖీలలో భాగంగా స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, మహిళా సహాయక కేంద్రం, పలు రికార్డ్స్ లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ ఆవరణ పరిశుభ్రంగా, పచ్చదనం ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ల పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పెండింగ్ కేసులలో విచారణ త్వరగతిన పూర్తి చేయాలని, కేసుల విచారణకు చేపట్టవలసిన విధానం గురించి దిశానిర్దేశం చేశారు. ఈ పోలీస్ స్టేషన్ ల పరిధిలో తరుచూ నమోదవుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడకూడదని, చెడునడత గలిగిన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో బీట్లు ఏర్పాటు చేసి నియంత్రించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సిబ్బందిని కేటాయించి వాటిని అరికట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. మహిళా పోలీసులతో మాట్లాడుతూ శక్తి యాప్, మహిళలపై జరిగే నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, రోడ్డు భద్రతా నియమాలు, ఓటిపి ఫ్రాడ్స్, బహుమతుల పేరున జరిగే ఆన్లైన్ మోసాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మరియు క్రికెట్ బెట్టింగులపై ప్రత్యేక దృష్టి సారించాలి. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరితో మాట్లాడుతూ అందరి యొక్క ఆరోగ్య పరిస్థితులను గూర్చి ఆరా తీశారు. వృత్తిపరంగా, ఆరోగ్యవరంగా, కుటుంబ వరంగా ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నది, మొదలైన విషయాలను వారితో ముఖాముఖి మాట్లాడారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్, మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియచేసి సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వేసవి కాలం ఆరంభమై ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పిర్యాదుదారులకు, పాదచారులు, పట్టణ ప్రజలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారుల దాహం తీర్చేందుకు కొండేపి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రకాశం జిల్లా ఎస్పీ గారు ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక భాగంగా పోలీస్ స్టేషన్ కు వచ్చే వారిని మర్యాద పూర్వకముగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కొండేపి సీఐ సోమశేఖర్, పొన్నలూరు ఎస్సై అనూక్ కొండేపి ఎస్సై ప్రేమ్ కుమార్ సస్టేషన్ సిబ్బంది మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## ఏల్చూరు జడ్పీ స్కూల్లో స్కౌట్ యూనిట్ ప్రారంభం




**రిపోర్టర్ సంతమాగులూరు, పెన్ పవర్ ఏప్రిల్03**

దేశభక్తిని పునికి పుచ్చుకుని ప్రతి విద్యార్థి నిజాయితీ, క్రమశిక్షణతో ఆపదలో ఉన్న వారికి సాయం చేయడానికి ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య పిలుపునిచ్చారు. పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) యోజన పథకంలో భాగంగా బుధవారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్ అండ్ గైడ్స్ ట్రూప్ యూనిట్ ను హెచ్ఎం ప్రారంభించారు. ఈసందర్భంగా స్కౌట్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తొలి బ్యాచ్ లోని 26 మంది విద్యార్థులకు స్కౌట్ యూనిఫామ్ దుస్తులు అందజేసి, స్కౌట్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. స్కూలు టీచర్ల బృందం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్, పీడీ డాక్టర్ ఎన్.వీరేంద్ర, టీచర్లు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గోపీనాథ్, మూర్తయ్య, కరిమున్నీసా, వీరకుమారి, పద్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ వల్లెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సాయినాధుని సన్నిధిలో దారపనేని



**పామూరు, పెన్ పవర్, ఏప్రిల్3.**

కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ వరికుంటపాడు గ్రామంలో వెలసివున్న శ్రీ సాయిబాబా దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విశ్వా వసు నామ సంవత్సరం చైత్రమాసం షష్టి గురువారం సందర్భాన్ని పురస్కరించుకొని సాయిబాబా ను దారపనేని దర్శించుకున్నారు. గురువారం బాబా దర్శనం తో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకం అన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేసి, బాబా తీర్థ ప్రసాదాలు దారపనేని కి అందజేశారు.

## ఇంటర్నెట్ మార్పిడి విధానం పై అధికారిక ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 03**

గత 5 సంవత్సరాలలో దేశం కోసం ఇంటర్నెట్ మార్పిడి విధానాన్ని అధికారికం చేయడానికి ప్రభుత్వ సర్వే / అధ్యయనం, అభివృద్ధి, అధికారిక నియంత్రణ అధారిటీ ఏర్పాటుకు ట్రాయ్ ప్రతిపాదనల ఆమోదం గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నను లేవనెత్తారు. కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి, పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిస్తూ ఇంటర్నెట్ మార్పిడి కేంద్రం అనేది ఒక భౌతిక స్థానమని, దీనిద్వారా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, కంటెంట్ నెట్ వర్క్, ఇతర ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల కంపెనీలు తమ నెట్ వర్కులను కలుపుకొని ఇంటర్నెట్ ట్రాఫిక్ మార్పిడి చేసుకొనుటకు వీలవుతుందని తెలిపారు. డేటా సెంటర్లను, కంటెంట్ డెలివరీ నెట్ వర్కులను, ఇంటర్ కనెక్ట్ ఎక్స్చేంజీలను ఏర్పాటు చేయడం ద్వారా ఇంటర్నెట్ మార్పిడి విధానంపై, డేటా ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించుటకు ఒక నియంత్రణ విధానాన్ని టెలికం రెగ్యులేటరీ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) 2022 నవంబర్ 18 తేదీన సిఫార్సు చేసిందని, టెలీకమ్యూనికేషన్స్ ఆక్ట్ 2023 క్రింద నెట్ వర్క్ అధికారాల నిబంధనలు, షరతులపై 2025 ఫిబ్రవరి 17 తేదీన సిఫార్సు చేసిందని తెలిపారు. ఈ ప్రతిపాదనలను ప్రస్తుతం పరిశీలనలో వున్నాయని, ఇది పాలసీ విషయమైనందున, నిర్ణీత సమయంలో నిర్ణయించడం కుదరదని తెలిపారు.



## నేడు ప్రజాదర్బార్, మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

### డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 3**

చంద్రశేఖర పురం పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మరియు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమంనకు ముఖ్యఅతిథిగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొంటున్నారని మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంగయ్య తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు తెల ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజలందరూ నేటికీ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆధార్ కార్డు జిరాక్స్ తో పాటు అర్జీ రూపంలో ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినట్లయితే, సమస్యను పరిష్కరించుటకు ప్రజా దర్బార్ లో మండల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో వీలైనంత మటుకు అక్కడికక్కడే సమస్యను పరిష్కారానికి చొరవ చూపుతారని తెలిపారు. సాంకేతిక లోపం వల్ల, ఇతర కారణాలవల్ల సమస్యలు ఉన్నట్లయితే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించుటకు, న్యాయబద్ధంగా ఉన్న సమస్యలు పరిష్కరించుటకు వాటికి సంబంధించిన అధికారులకు పలు సూచనలు ఇచ్చి పరిష్కారం చేయుటకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు సిఎస్పురం మండలంలోని తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన పార్టీల నాయకులు ప్రజలకు తెలియ పరిచి ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా కోరారు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రాయల్ స్టే ఇన్ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించిన :కదిరి




**చంద్రశేఖరపురం ,పెన్ పవర్ ఏప్రిల్ 3**

మండలంలోని సియస్ పురం గ్రామానికి చెందిన ప్రముఖ రియల్టర్ శ్రీరామ శ్రీనివాసులు హైదరాబాదులోని పటాన్ చెరువులోని నూతన రాయల్ స్టే ఇన్ గెస్ట్ హౌస్ ను మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా కదిరి బాబురావు ను గెస్ట్ హౌస్ యజమాని శ్రీరామ శ్రీనివాసులు అభినందించి శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కదిరి ప్రకాష్ రావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పాలగుల్ల మల్లికార్జునరె డ్డి, వైస్ ఎంపీపీ దుగ్గి రెడ్డి ప్రతాపరెడ్డి, అనికాలపల్లి సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి ,గడ్డం వెంకటేశ్వర్లు ,కటికాల సత్యం, సిద్దు వెంకటరెడ్డి ,బసివి శేఖర్, తదితర లు పాల్గొన్నారు.

## అరివేములలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు నీటి వసతి కల్పించాలి



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 3**

చంద్రశేఖరపురం మండలం అరివేముల గ్రామంలో గల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నీటి సౌకర్యం లేక నిత్యం వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలో బోరు సౌకర్యం లేకపోవడంతో సమస్య ఏర్పడింది. ఆయుర్వేద వైద్యశాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి వైద్య సేవల కోసం ఆస్పత్రికి వస్తారు ఇప్పటికే ఎండలు తీవ్రత పెరగడంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు వేసవి తాపానికి అల్లాడుతున్నామని పలువురు వైద్యశాలకు వచ్చే ప్రజలు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు నేడు జరగబోయే మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో బోరు వేసి నీటి సౌకర్యం కల్పించాలని ఆసుపత్రికి వచ్చే ప్రజలు కోరుచున్నారు.

## క్రైస్తవ సంఘాల జె ఏ సి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

గిద్దలూరు పట్టణంలో పాస్టర్ ప్రవీణ్ మరణం పై ఉన్నత స్థాయి విచారణ జరపాలని పాస్టర్లు క్రైస్తవ సోదరులు ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పగడాల ప్రవీణ్ కేసులో సరైన దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని పాస్టర్ ను చంపిన వారికి వెంటనే శిక్షించాలి అని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో క్రైస్తవ పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం, ప్రజా దర్బార్ కార్యక్రమం

### ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య

**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 3**

చంద్రశేఖరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య తెలిపారు అనంతరం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ (ప్రజా దర్బార్) కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరుగును. మండలంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల జట్టు ఎంపిక





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03**

ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ప్రకాశంజిల్లా ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో డిస్టిక్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్డీఓ రాజరాజేశ్వరి, ప్రకాశంజిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, ప్రకాశంజిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుంటి భక్త ధృవుడు, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యధ్యక్షులు గుంటి పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మల్లికార్జునరావు, రాఘవరావు, క్రైమ్ బ్రాంచ్ సాయి, అనిల్, పీఈటి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉప రవాణాశాఖ కమీషనర్ సుశీల స్పాన్సర్ చేసిన ఫ్రీ కాస్ట్యూమ్స్ ని డీఎస్డీవో ఆవిష్కరించడం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సుమారు నూట యాభై మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ముఖ్య అతిథులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రకాశంజిల్లాకు ఎన్నో పతకాలు తీసుకుని రావాలని క్రీడాకారులను అభినందించారని ప్రకాశంజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి భక్తధృవుడు తెలిపారు.

# విద్యలో రాణించాలి లక్ష్యం చేరుకోవాలి



**ఆర్ సి ఇన్ చార్జీ యర్రగొండపాలెం పెన్ పవర్ ఏఫ్రియల్ 3**

విద్యను అభ్యసించడం నిత్యం సాధనేనని తరగతి గదులు మారిన,పైచదవులకు వెళ్ళిన లక్ష్యం చేరుకునే క్రమంలో పట్టుదల వదలకూడదని వక్తలు యంపిడిఓ బి,శ్రీనివాసులు, యంఈఓలు పి.ఆంజేనేయులు అన్నారు. గురువారం విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ ప్రారంభ కార్యక్రన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ స్వచ్చంద సంస్థ అందిస్తున్న ప్రోత్చాహాన్ని విద్యార్థులు సధ్వినియోగం చేసుకొని, ఉత్తమ ర్యాంకులు సాధించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ ను ఏర్పాటుచేయడం అభినందనీయమని అన్నారు. ఈ ఉచిత కోచింగ్ ని అందిపుచ్చుకొని విద్యార్థులు తమ లక్షన్ని చేరుకోవాలని, ఆకాంక్షిస్తూ విద్యార్థులు స్వచ్ఛంద సంస్థ లు నూతన సమాజానికి వారధులనీ ఆయన తెలియచేసారు ఈ కార్యక్రమం లో పభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సోషల్ వర్కర్ పూర్ణకంటి తిరుమలయ్య, వికలాంగుల జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య , ట్రస్ట్ చైర్మన్ సంద్రపాటి విజయ్ కుమార్ మరియు ట్రస్ట్ మెంబెర్ స%ళి%ద్రపాటి నిరీక్షణ మరియు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03**

భారత ప్రభుత్వ గెజిట్ ప్రకారం, జిల్లాలోని షెడ్యూల్డు కులముల,షెడ్యూల్డు తెగల వారిపై జరుగు అత్యాచార కేసులు పరిశీలన.. నివారణ చర్యల కొరకు ఏర్పడిన జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీని జిల్లా నందు నూతన కమిటీ ఎంపిక చేయవలసి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. యస్.సి. యస్.టి సభ్యులు(నాన్ ఆఫీషియల్ మెంబర్స్ ) అనధికార సభ్యులు 5 ఖాళీలు, యస్.సి/యస్.టి., కాని ఇతర కులమునకు చెందినవారు (ఎన్జీఓస్)- 3 ఖాళీలు. కావున, షెడ్యూల్డు కులముల / షెడ్యూల్డు తెగల వారి పై సామాజిక సేవా దృకృథం, పౌరహక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టాల పై అవగాహన కలిగి ఉండి, ఆసక్తి సేవా భావము కలిగిన వారు ఇది వరకు చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలను తగిన ఆధారాలతో బయోడేటాతోపాటు జత పరచవలసిన ధ్రువ పత్రములతో (విద్యార్హత, కులము, రెసిడెన్సీ, నిరుద్యోగ మరియు సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలు) దరఖాస్తులను ఈనెల 15వ తేదీ లోగా జిల్లా యస్.సి. సంక్షేమ..సాధికారత అధికారి వారి కార్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ, ప్రగతి భవన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా నందు కార్యాలయం పనివేళలలో స్వయంగా అంద చేయాలని అన్నారు. ప్రభుత్వ,ఇతర ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగం చేయుచున్న వారు అనర్హులు అని తెలిపారు. పై రెండు కేటగిరీల క్రింద ఎంపిక కాబడిన వారికి ప్రభుత్వము నుండి ఎటువంటి గౌరవ వేతనములు చెల్లించరని తెలిపారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

-నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

-టెక్నాలజీ పై అవగాహన పెంచుకుంటూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

-ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలి



























**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, ఏప్రిల్ 3**

సాధారణ తనిఖీల్లో భాగంగా కనిగిరి డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయ పరిసరాలు, పోలీస్ క్వార్టర్స్, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులు, ఎస్డిపిఓ ప్రత్యేక కేసులకు సంబంధించి ధర్యాప్తుకు డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ కు పలు సూచనలు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పిటీషన్లు, డిసిర్బి మరియు డిపిఓ కు సంబంధించిన రిప్లయ్స్ ను త్వరితగతిన పంపించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో నెలకొన్న పరిస్థితులు మరియు శాంతి భద్రతల అంశాలపై కనిగిరి డీఎస్పీ చర్చించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. సబ్ డివిజన్ ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బంది ఏఏ విధులు నిర్వర్తిస్తున్నారో ఆరా తీసినారు. విధి నిర్వహణలో వారు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

కనిగిరి సర్కిల్ కార్యాలయం, కనిగిరి, హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్ లను జిల్లా ఎస్పీ దామోదర్ సందర్శించారు. పోలీస్ స్టేషన్ల యొక్క పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్ ల నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డ్ లను పరిశీలించి, నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని, కేసుల పరిష్కారంలో జాప్యం వహించే కొలది బాధితులకు సత్వర న్యాయం అందించలేమని దానికి అనుగుణంగా పోలీస్ స్టేషన్ ల యొక్క నిర్వహణ ఉండాలని సూచించారు.

పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరితో మాట్లాడుతూ అందరి యొక్క ఆరోగ్య పరిస్థితులను గూర్చి ఆరా తీశారు. వృత్తిపరంగా, ఆరోగ్యవరంగా, కుటుంబ వరంగా ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నది, మొదలైన విషయాలను వారితో ముఖాముఖి మాట్లాడారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియచేసి సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని, ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా వుండాలన్నారు. కనిగిరిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో జిల్లా ఎస్పీ దామోదర్ కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థులు క్రమశిక్షణగా మెలిగి, బాగా చదువుకోవాలని, వారి కుటుంబసభ్యులు బైక్ మీద వెళ్లేటప్పుడు రహదారి భద్రత నియమాలు పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకొని వెళ్ళమని చెప్పాలని ఎస్పీ దామోదర్ సూచించారు.

జిల్లా ఎస్పీ దామోదర్ మహిళా పోలీస్ లతో మాట్లాడుతూ వారి పరిధిలో ఉన్న ప్రజలతో నిత్యం మమేకం అవుతూ, వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కరణలో తమ వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాట్ టచ్, రోడ్డు భద్రత నియమాలు, క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్ మరియు మాదక ద్రవ్యాల పై ప్రజలకు మరియు విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

కనిగిరిలోని శ్రీషిరిడి సాయిబాబా దేవస్థానం, శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానము జిల్లా ఎస్పీ దామోదర్ ముందుగా సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూతనంగా నిర్మిస్తున హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్ ను ఎస్పీ దామోదర్ సందర్శించి, ఇప్పటివరకు పూర్తీ అయినా పనులను పరిశీలించి మిగిలిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్ ను పరిశీలించి, పోలీస్ స్టేషన్ యొక్క నమూనాలో అవసరం మేరకు చేయవలసిన మార్పులను గురించి ఎస్పీ దామోదర్ తెలియజేశారు.

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ వెంట కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కనిగిరి సీఐ ఖాజావలి, కనిగిరి ఎస్సై శ్రీరామ్, హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు మరియు సిబ్బంది తదితరులు ఉన్నారు.





# ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయండి

**డి ఏ లు సర్వీస్ బ్యాలెన్స్ అమౌంట్ చెల్లించాలి.**

**వర్క్ ఫ్రం హోం సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి.**

**గ్రూప్ కాన్ఫరెన్స్ ద్వారా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చిన ఎంపీడీవో మస్తాన్ వలి.**



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి గ్రామ సచివాలయాల సిబ్బందికి గ్రూప్ కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన వర్క్ ఫ్రం హోం ,మిస్సింగ్ సిటిజన్, హౌస్ హోల్డ్ ఇమేజ్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, తదితర సర్వేలను చేయవలసిందిగా ప్రభుత్వం ఆదేశించిందని ,అయితే ఇప్పటివరకు మిస్సింగ్ సిటిజెన్, హౌస్ హోల్డ్ ఇమేజ్ సర్వేలు నూరు శాతం పూర్తి అయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే జరుగుతున్నదని ,ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి వారికి ఆర్థిక సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా వర్క్ ఫ్రం హోం సర్వే నిర్వహిస్తున్నట్లుగా ఆయన చెప్పారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు సర్వీస్ అమౌంట్ బ్యాలెన్స్ ను వెంటనే చెల్లించాలన్నారు. చిన్నారుల తల్లులు వలసలు వెళ్ళినందువల్ల వారి పిల్లల ఆధార అప్డేట్ చేయడంలో కొంత జాప్యం జరుగుతున్నదని ,సదరు ఆధార్ అప్డేట్ కూడా దాదాపుగా పూర్తి అయిందని అన్నారు. జి ఎస్ డబ్ల్యు ఎస్ సర్వేలన్నీ త్వరగా గతిన పూర్తి చేయాలని ఆయన గ్రామ సచివాలయాల సిబ్బందికి గ్రూప్స్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశిస్తూ తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

# అన్న క్యాంటీన్ లో కమిషనర్ అల్పాహారం



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 03**

ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి. వెంకటేశ్వర రావు గురువారం తన కార్యాలయం ఇంజనీరింగ్, శానిటరీ సిబ్బంది తో కలిసి పవర్ ఆఫీస్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. ఉదయం అల్పాహారం లో భాగంగా ప్రజలకు అందజేస్తున్న ఇడ్లీ, పూరి లను టోకెన్లు తీసుకొని సిబ్బందితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ల నందు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందచేయబడుతోందో లేదో తెలుసుకోవటానికి కార్యాలయం సిబ్బందితో కలిసి అల్పాహారం తీసుకోవటం జరిగిందని తెలిపారు. క్యాంటిన్ వారు అందచేసిన ఇడ్లీ, పూరీలు క్వాలిటీ తో పాటు క్వాంటిటీలో రాజీ పడకుండా అన్న క్యాంటిన్ నిర్వాహకులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, నగరపాలక సంస్థ యంఈ చంద్రయ్య,డి.ఈ అనిల్, ఏఈ చంద్ర శేఖర్, ఇంచార్జ్ ఏఈ లు సాయిరాం, నాగార్జున లు, సర్వేయర్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాబ్జి, మిరియం శ్రీను పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కు ఏపీజిఈఏ అభినందనలు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 03**

బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహణకు గాను స్కోచ్ అవార్డు పొందిన ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా కు ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలెక్టర్ ని కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, భూపాల్ రెడ్డి, రజిత మానస, పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాసరావు, శ్రీకాంత్ రెడ్డి, గౌరీ , బాబురావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# బయోగ్యాస్ భూమి పూజ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

## డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 3**

కనిగిరి నియోజకవర్గం పిసి పల్లి మండలం లోని దివాకరపల్లి బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమమునకు చంద్రశేఖరపురం మండలం నుండి భారీ ఎత్తున జన సమీకరణతో బయలుదేరి విజయవంతం చేసిన చంద్రశేఖరపురం మండల ప్రజలకు, అధికారులకు, తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ నాయకులకు మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అహర్నిశలు కృషి ఫలితంగా బయోగ్యాస్ నిర్మాణం ద్వారా కనిగిరి నియోజకవర్గం లోని నిరుద్యోగులకు మరియు కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమమునకు మండల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఆనంద నగర్ దళిత క్రైస్తవ స్మశానానికి బాట మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వినతి పత్రం ఇచ్చిన ఆనంద్ నగర్ ప్రజలు మరియు దళిత నాయకులు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 3:**

బాపట్ల పట్నంలోని ఆనంద నగర్ దళితులకు గత 50 సంవత్సరాల క్రితం సూర్యలంక బైపాస్ పక్కన 35 సెంటు స్థలము స్మశాన వాటికకు మంజూరు చేయడం జరిగింది అప్పటినుండి ఆనంద నగర్ దళితులు దళిత క్రైస్తవులు సాంప్రదాయ బద్ధంగా పార్థివదేహాలను బాక్సో పెట్టుకొని ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఖననం చేసుకునేవారు ఇప్పుడు ఆనంద నగర్ లో జనాభా పెరుగుదల వలన 130 కుటుంబాలు ఏర్పడ్డాయి స్మశాన భూమి సరిపోవడం లేదు మరి ముఖ్యంగా బైపాస్ నుంచి స్మశానంకు వెళ్లేందుకు మార్గం లేదు స్మశాన భూమిని చుట్టుపక్కల ఉన్నవారు ఆక్రమించుకోగా మిగిలిన కొద్దిపాటి భూమిలో శవాలను ఖననం చేసుకుంటున్నారు ఈ సమస్యలన్నిటిని అంటరానిత నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చారువాక జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు ఈరోజు జిల్లా కలెక్టర్ ని కలసి వినతి పత్రం ఇచ్చారు డాక్టర్ చార్వాక మాట్లాడుతూ ఆనంద నగర్ ప్రజలకు స్మశానానికి వెళ్లేందుకు బాటలేక ఇబ్బంది పడుతున్నారని పంట పొలాల్లో నుండి వెళ్ళవలసి వస్తుందని స్మశానానికి వెళ్లడానికి బాట మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళిని కోరడం జరిగింది కలెక్టర్ స్పందిస్తూ బాట మంజూరు చేసే విధంగా రెవెన్యూ అధికారులతో మాట్లాడి త్వరలో మీకు బాటను ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు ఈకార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు సీనియర్ దళిత నాయకులు కొరగంటి శ్యాము. ఆనంద నగరకు చెందిన కొప్పోలు, లక్ష్మీ,కంచర్ల మేరీ, చింతబత్తిన యేసు ప్రియ, వరదల అన్నమ్మ, కాంద్రు వాణి, చేగుడి పౌలు ,పెరికల బాబు, మోడే నారాయణ, చింతా శాంత కుమార్,.పాస్టర్ మోజెస్. పాస్టర్ ప్రసంగి తదితరులు పాల్గొన్నారు



# ఆటో వర్కర్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

## హర్షం వ్యక్తం చేసిన ఏఐటీయూసీ నాయకులు




**చీరాల,పెన్ పవర్,ఏప్రిల్ 03**

వేసవి తాపాన్ని తట్టుకోవడంలో ప్రజలకు తాగునీరు,మజ్జిగ వంటి శీతల పానీయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. గురువారం స్థానిక ఆటో డ్రైవర్స్,వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ ఐ పవన్ కుమార్ చేతుల మీదుగా ఉచిత మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలకు చల్లని మజ్జిగ అందించడంతో పాటు, దాహార్తిని తీర్చడమే తమ లక్ష్యమని తెలిపారు. ఉచితంగా మజ్జిగ పంపిణీతో కూలీలకు,వాహనదారులకు ఎండ తీవ్రత నుంచి బయటపడేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ అధ్యక్షుడు డి నాగేశ్వరరావు నియోజవర్గ కార్యదర్శి భాసి పైడయ్య చీరాల పట్టణ సిపిఐ కార్యదర్శి సైకం రాజశేఖర్, ఆచ్యుతుని బాబురావు,బీసీ ఫెడరేషన్ నాయకులు ఉటుకూరి వేంకటేశ్వర్లు,సీనియర్ సిటిజన్స్ నాయకులు గాదె హరిహరరావు, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు నాగరాజు,కార్యదర్శి భాను ప్రకాష్, కరిముల్ల,నాగేశ్వర రావు,రవికిరణ్, సుబ్బారావు, నరేంద్ర, కొండబాబు సుధీర్ తదితరులు పాల్గొన్నారు..




# డాక్టర్ గీతకు శుభాకాంక్షలు తెలిపిన గౌస్ బాషా





**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 3**

స్థానిక ప్రముఖ మహిళా డాక్టర్ స్వర్ణ గీతకు జిల్లా టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా శుభాకాంక్షలు తెలియజేశారు డాక్టర్ స్వర్ణ గీత రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యురాలిగా నియమితులయ్యారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం నాడు గౌస్ బాషా డాక్టర్ స్వర్ణ గీతను కలసి శాలువాతో సత్కరించి, తన శుభాకాంక్షలు తెలియజేశారు అదే విధంగా మహిళా నాయకురాలు అయిన వరి కుటి శిరీష, వై కిరణ్మయి లు కూడా డాక్టర్ స్వర్ణ గీతను కలుసుకుని శాలువా, పూలదండతో సన్మానించి, తమ అభినందనలు తెలియజేశారు

# ప్రజలను భయకంపితులను చేసిన ఉరుములు మెరుపులు.

***గురువారం రాత్రి 8 గంటల నుంచి పెద్ద పెద్ద శబ్దాలతో ప్రారంభమైన ఉరుములు మెరుపులు.***

***ఉరుముల దాటికి పొలాల్లో పిడుగులు పడి ఉంటాయని భావిస్తున్న ప్రజలు.***

***అరగంట పాటు కురిసిన ఒక మోస్తరు వర్షం.***

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

కొమరోలు గురువారం రాత్రి 8 గంటల నుంచి పెద్దపెద్ద శబ్దాలతో ప్రారంభమైన ఉరుములు మెరుపులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. మధ్యాహ్నం కొద్దిపాటి ఉరుములు మెరుపులతో చిరుజల్లులు కురిసాయి. అయితే రాత్రి 8 గంటల నుంచి సంభవించిన పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు మెరుపులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. పెద్ద పెద్ద శబ్దాలతో ఏర్పడిన ఉరుములు మెరుపులకు ఇళ్లలో ఉన్న వారే తీవ్ర భయాందోళన గురై, తలుపులు వేసుకుని ఇళ్లలో ఉండిపోయారు. ఇక ఆరు బయట ,రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు పరిస్థితి వర్ణనాతీతం. ఉరుములు మెరుపుల దాటికి పొలాల్లో పిడుగులు పడి ఉంటాయని ప్రజలు భావిస్తున్నారు. ఆకాశంలో ఏర్పడిన ఉరుములు మెరుపులు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పెనుగాలులు లేకపోవడంతో విద్యుత్ శాఖకు ప్రజలకు నష్టం జరగలేదని భావిస్తున్నారు. అయితే రాత్రి 8 గంటల నుంచి అరగంట పాటు ఒక మోస్తరు వర్షం కురిసింది. దీనితో వాతావరణం చల్లబడి చల్లని గాలులు వీచి ప్రజలకు ఉక్కపోతనుంచి కొంత ఉపశమనం కలిగించాయి.

# ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

**బేస్తవారిపేట పెన్ పవర్ ఏప్రిల్ 3**

బెస్తవారిపేట మండలంలో గురువారం సాయంత్రం వేసిన ఈదురుగాలులకు మండలంలోని జెన్నీ వారి పల్లి, చెరుకుపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. సాయంత్రం వేళ కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు జెన్నీవారి పల్లి గ్రామంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు పడిపోవడంతోవిద్యుత్ సరఫరా పూర్తిగా అకాల వర్షం ఈదురు గాలులకు పొలాల్లో ఉన్నటువంటి మొక్కజొన్న మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అంధకారంలో మండలంలోని పలు గ్రామాలు ఉన్నట్టు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



## 14 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన సి. సి డ్రైన్ శంకుస్థాపన

*35 లక్షల రూపాయలతో నిర్మించిన సి.సి రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి*





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 3**

పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద 35 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సి.సి రోడ్ల ను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. 2వ వార్డు జనార్ధన కాలనీ పుట్ట వద్ద 14 లక్షలు రూపాయలతో నిర్మిస్తున్న నూతన సి.సి డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న ఉర్దూ స్కూల్ రోడ్డు కు నిధులు కేటాయించి రోడ్డు నిర్మించి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అభివృద్ధి జరుగుతున్నప్పుడు ప్రజలు అందరూ సహకరించాలి. 2వ వార్డు పరిధిలో కొన్ని సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరస్వామి చిలకపాటి మధు, షేక్ రఫీ, యడ్లపల్లి సుబ్బారావు, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను, వడ్డెళ్ళ రవిచంద్ర, రావూరి రామకోటయ్య, వాకా రాజారెడ్డి స్థానిక నాయకులు షేక్ నాగూర్, కూనం నరేంద్ర, గడ్డం మాలకొండయ్య, తుమాటి బ్రహ్మయ్య, మర్రిపూడి శ్రీను, కంద్రా మాలకొండయ్య, చుండూరి శ్రీను, పువ్వాడి కోటయ్య, ముచ్చు వేణు, పులి నాగరాజు, షేక్ మమ్ముషా, యర్రా ముసలయ్య, తిరుమలశెట్టి మధు, రామరాజు, వెంకాయమ్మ, షేక్ కాలేషా, మురళి, సుల్తాన్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ బియ్యం రవాణాను అడ్డుకున్న సబ్ కలెక్టర్

**బేస్తవారిపేట, పెన్ పవర్ ఏప్రిల్ 3**

స్థానిక ఆర్కే నగర్ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం రవాణాను గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అడ్డుకున్నారు. రేషన్ బియ్యాన్ని శుద్ధి చేసి వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో లారీని సీజ్ చేయడంతో పాటు లారీలో ఉన్న 600 బస్తాల రేషన్ బియ్యాన్ని కంభంలోని ప్రభుత్వ గోదాములకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జితేంద్ర, ఎన్ఫోర్స్మెంట్ డీటీ రామనారాయణ రెడ్డి, ఎఫ్ ఐ సల్మాన్, ఆర్ ఐ కాశయ్య, సిబ్బంది పాల్గొన్నారు.







# విలువలతో కూడిన విద్య అవసరం

### ప్రపంచంలో తొలి గురువులు తల్లిదండ్రులే -విద్యార్థులను సెల్ ఫోన్ల కు దూరంగా ఉంచాలి

### తల్లిదండ్రులకు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన ప్రదీప్ ప్రసంగం -ఘనంగా ఆక్స్ ఫర్డ్ వార్షికోత్సవ సంబరాలు












బిఆర్

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 3**

ప్రస్తుతం సమాజంలో విలువలతో కూడిన విద్య చాలా అవసరం అని ప్రేరణాత్మక వక్త కె.వి. ప్రదీప్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆక్స్ఫర్డ్ క్రీడా ప్రాంగణంలో బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల 11 వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువులతో పాటు తల్లిదండ్రులకు కూడా బాధ్యత ఉందని అన్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిలో స్ఫూర్తిని ధైర్యాన్ని తల్లిదండ్రులు కూడా నింపాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని రగిలించి వారిలో కొత్త ఆలోచనలకు పదునుపెట్టాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా దిశానిర్దేశం చేశారు. స్ఫూర్తిదాయకమైన కథనాలు, జీవితానుభవనాలు మిళితం చేసి విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగించేలా ప్రసంగించారు. విద్యార్థులకు సెల్ ఫోన్లు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు పడాలని ఒకవేళ విద్యార్థులు సెల్ఫోన్ చూడవలసి వస్తే అది తల్లిదండ్రులు సమక్షంలో చూసేలా జాగ్రత్తలు పాడాలని కోరారు. ప్రస్తుతం సోషల్ మీడియా విద్యార్థులను పెడదోవ పట్టించే విధంగా ఉందని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ముందు సెల్ ఫోన్లను, టీవీలను చూడడం తగ్గించాలని లేకుంటే వారు కూడా అనుకరించే ప్రమాదం ఉందని అన్నారు. విద్యార్థులను ధైర్యవంతులుగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని భవిష్యత్తుకు కావలసిన బంగారు బాటలు వేసుకునే విధంగా ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. ఒకే లక్ష్యం నిర్దేశించుకొని పదేపదే ప్రయత్నించే కంటే రెండు మూడు రకాలైన దారులను ఎంచుకొని ఏదో ఒక లక్ష్యంతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. తమ పిల్లలను తల్లిదండ్రులు వేరొకరితో పోల్చుకోకుండా పిల్లలపై ఒత్తిడి పెంచకుండా స్ఫూర్తిదాయకమైన మాటలతో వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నించాలని కోరారు. విద్యార్థులకు తొలి గురువులు ప్రపంచంలోనే తల్లిదండ్రులు మాత్రమేనని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే నని కావున ఉపాధ్యాయులను ఎప్పుడు గౌరవించాలని సూచించారు.




ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ ట్యాంకులో నిండుగా నీరు ఉంటే ఏ కులాయి తిప్పిన నీరు వస్తుందని అలాగే మన బ్రెయిన్ లో జ్ఞానాన్ని నింపుకుంటే ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం దొరుకుతుందని, మంచి మార్కులతో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. ఎవరు ఏం చెప్పినా ముందు వినాలని దాన్లో మంచిని మాత్రమే గ్రహించాలని విద్యార్థులకు సూచించారు. మండల విద్యాశాఖ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కష్టంతోపాటు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ బాల భాస్కర్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష పత్రాలు తామే తయారు చేస్తామని అన్నారు. నిరంతరం మేనేజ్మెంట్ విద్యార్థులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఇళ్ల చుట్టూ తిరుగుతూ ఉండే సమయం మా దగ్గర లేదని మా సమయం అంతా విద్యార్థుల భవిష్యత్తుకే కేటాయిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు అతిథులు అందరూ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈకార్యక్రమంలో ప్రదీప్ సతీమణి జేసీ సరస్వతి, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బెజవాడ నరేంద్రబాబు, స్థల దాత దామా వెంకటేశ్వర్లు, కందుకూరు, కనిగిరి కాలేజీ స్కూల్స్ డైరెక్టర్స్, డీన్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాన్ని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతాం

### పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

### పురపాలకసంఘ అనుమతుల మేరకు వాణిజ్య, గృహ నిర్మాణాలు చేపట్టాలి -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 3:**

అభివృద్ధి చేసి చూపించేది కూటమి ప్రభుత్వమని, మాటలు చెప్పేది వైకాపా ప్రభుత్వమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జగన్మోహన్ రెడ్డి రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి 26 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పి అరకొర నిధులిచ్చి ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఫిబ్రవరి 15 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా కందుకూరు పట్టణానికి విచ్చేసినప్పుడు మున్సిపాలిటీకి 50 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి ముందుగా 26 కోట్ల రూపాయలు నిధులకు ప్రణాళికలు అంచనాలు తయారు చేయాలన్నారు.. దానిలో భాగంగా అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా 25 కిలోమీటర్ల మేర రోడ్లు 14 కిలోమీటర్ల మేర డ్రైన్ లకు నిధులు అవసరమవుతాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ , నుడా




చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నుడా విసి సూర్యతేజ, మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో చర్చించామన్నారు.

పట్టణ ప్రజలు అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలు, గృహాల యజమానులు మున్సిపాలిటీ నిబంధనల మేరకే నిర్మాణాలు చేయాలని అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించడం జరిగింది. ఎవరైనా మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి తన పేరు కానీ, పార్టీ పేరు కానీ వాడుకొని వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అమృత్ 2.0 పథకం కు కందుకూరు మున్సిపాలిటీ ఎంపికైందని, దానిలో భాగంగా త్వరలో 49 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడతాయని, ఆ నిధులతో పట్టణంలో మౌలిక వసతులు కల్పనకు, కుంటల సుందరీకరణ, ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు వినియోగిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన ఎం.ఆర్.ఎఫ్ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ లో అత్యధిక టెక్నాలజీ ద్వారా రోజుకు 30 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసే మిషన్ ను త్వరలో ఏర్పాటు చేసి ఏ రోజు చెత్తను ఆరోజు ప్రాసెసింగ్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## మహిళల ఆర్ధికాభివృద్ధికి అండగా కుట్టు శిక్షణ. ఎమ్మెల్యే

**బ్యూరో రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు - ఏప్రిల్ 3**

వెంకటాచలంలోని మహిళా ప్రాంగణంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని గురువారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ స్టైఫండ్ తో పాటు ఉచితంగా మిషన్ ను మహిళలకు అందిస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన సౌకర్యాల కల్పనకు రూ.5.91 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్క మహిళ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి కోరారు.



పెన్ పవర్
నెల్లూరు | తిరుపతి | చిత్తూరు

# ఐదేళ్ల తర్వాత మళ్లీ ట్రాక్‌లోకి సంక్షేమ పథకాలు

## భవిత కేంద్రాలో 42 మంది గిరిజనులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు పంపిణీ.







**బ్యూరో రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు -ఏప్రిల్ 3**

వెంకటాచలం మండలంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ లో గురువారం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్యకారులకు సైకిళ్లు, వలల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా 42 మంది గిరిజనులకు సైకిళ్లు, చేపల వలలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ ఒక్కో యూనిట్ విలువ రూ.10 వేలు కాగా, లబ్ధిదారుడి వాటా రూ.1000 మాత్రమే అన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో గిరిజన బిడ్డలకు మంజూరైన ఈ యూనిట్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ పక్కనపెట్టేసింది అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి సంక్షేమ ఫలాల పంపిణీ పున:ప్రారంభమైంది అని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం జిల్లాలో 38 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి అన్నారు. ఈ కేంద్రాల్లో 734 మంది చిన్నారులు ఉండగా, వారికి 72 మంది సేవ చేస్తున్నారు అని భవిత కేంద్రాల్లో చిన్నారులకు సేవలు అందించడంలో ఆయాలు చేస్తున్న కృషి అభినందనీయమైనది అన్నారు.ఆ చిన్నారుల్లో అవసరమైన వారికి ఈరోజు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు కూడా తిరిగి ప్రారంభమయ్యాయి అని వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజనుల సంక్షేమాన్ని కూడా అప్పటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసేసింది అని బటన్ నొక్కుడు తప్ప మిగిలిన కార్యక్రమాలన్నింటిని జగన్ రెడ్డి గాలికొదిలేశారు అన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూలు కోసం స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## పీరయ్య సంతాప సభలో ఎమ్మెల్యే



**కావలి పెన్ పవర్ -ఏప్రిల్ 3**

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం మంగళగిరి లో ఎంజిఎన్ఆర్ఇజిఎ, నీరు చెట్టు విభాగాల సభ్యులు వీరంకి గురుమూర్తి, సుభాషిని, ఆళ్ల గోపాలకృష్ణ, శ్రీధర్, రాజా నేతృత్వంలో జరిగిన విభాగం సభ్యుడు పీరయ్య సంతాప సభ లో పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర, మాజీ శాసన మండలి సభ్యులు అశోక్ బాబు లతో కలిసి కావలి శాసన సభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బాలిక చదువు కోసం మన ఫౌండేషన్ ఆర్థిక సహాయం.

**ఉదయగిరి పెన్ పవర్ - ఏప్రిల్ 3**

ఉదయగిరిలోని నాగులబావిరికి చెందిన ఎస్.కె సమన్ అనే బాలిక తల్లిదండ్రులను కోల్పోయి అనాథ స్థితిలో ఉన్నప్పుడు షకీరా అనే మహిళ ఆ బాలికను చేరదీసి అన్ని తానై కన్న బిడ్డల సంరక్షిస్తూ చూసుకుంటున్న నేపథ్యంలో ఆ బాలికకు చదువుకు ఆటంకం ఏర్పడడంతో తను చదువుకు సాయం అందించాల్సిందిగా మన్నేటి వెంకటరెడ్డిని కోరింది వెంటనే స్పందించిన మన ఫౌండేషన్ వ్యవస్థాపకులు తెలుగుదేశం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి విద్యార్థి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుకునేందుకు ప్రస్తుతానికి తక్షణ సాయం కింద పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అంతేకాకుండా సదరు విద్యార్థికి షుగర్ కిడ్నీ వ్యాధి ఉందన్న విషయం తెలుసుకొని ఆమెకు ప్రభుత్వ పరమైన సాయం అందించేందుకు శాసనసభ్యుల సహకారం అవసరమని తెలి పారు. శాసనసభ్యులు కాకర్ల సురేష్ ని కలిసి విద్యార్థి



విష యం తెలియజేయాలని సూ చించారు భవిష్యత్తులో మరి ఏదైనా అవసరం అయితే సాయం అందిం చేందుకు ముందు ఉంటానని హామీ ఇచ్చారు. బాగా చదువుకోవాలని కోరా రు. బాలిక సంరక్షకు రాలు షకీరా బాలిక సమన్ మన్నేటి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు దీంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తపరిచారు.

# షేక్ నూర్జహాన్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్





**ఉదయగిరి పెన్ పవర్ - ఏప్రిల్ 3**

కలిగిరి మండలం ఎరుకల రెడ్డి పాలెం లో షేక్ మస్తాన్ నూర్జహాన్ దంపతులచే సొంత నదులతో నిర్మాణం చేసిన వాటర్ ప్లాంట్ ను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శ్రీమతి ప్రవీణ దంపతుల చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. అదేవిధంగా అదే గ్రామంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశానని చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్న ఊరు కన్నతల్లి ని మరువకూడదు అన్న దృఢ సంకల్పంతో, అందరం బాగుండాలి అందులో మనం ఉండాలి అనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నినాదంతో, తమిళనాడులోని చెన్నైలో స్థిరపడి పుణ్యభూమి రుణం తీర్చుకునేందుకు సొంత గ్రామంలో షేక్ మస్తాన్ నూర్జహాన్ దంపతులు తమ సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ను మరియు అభయాంజనేయ స్వామిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారు చేస్తున్న సేవలను కొనియాడి ప్రశంసించారు. అదేవిధంగా అనేక గ్రామాల రామాలయాలకు విగ్రహాలు ఏర్పాటు, అభాగ్యులకు ఆర్థిక సహాయం షేక్ మస్తాన్ నూర్జహాన్ దంపతులు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులకు మండలం మరియు గ్రామ నాయకులతోపాటు, షేక్ మస్తాన్ నూర్జహాన్ దంపతులు ఘన స్వాగతం పలికారు. శాలువాలు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, మండల నాయకులు గ్రామ నాయకులు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఉర్లగొంది తిప్పలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ..!

## ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల.. ఎమ్మెల్యే కాగిత హాజరు.







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 03:**

సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న మాటను నిలబెట్టిన యుగపురుషుడు. వెండితెరపై నట విశ్వరూపం, రాజకీయాల్లో ప్రజల కోసం పోరాడిన అగ్రనాయకుడు నందమూరి తారక రామారావు అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కృత్తివెన్ను మండలం ఉర్లగొంది తిప్ప గ్రామంలో గురువారం దివంగత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఒక చరిత్ర, ఒక స్ఫూర్తి, ఒక శాశ్వత అనుభూతి. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు .. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి అన్న ఎన్టీఆర్ అన్నారు. పేద ప్రజలందరికీ రెండు రూపాయల కిలో బియ్యం అందచేసిన దేవుడని, ఆడపిల్లలకు ఆస్తి హక్కు కల్పించిన సంఘసంస్కర్త అని ఎమ్మెల్యే విశదీకరించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్య బోధనకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఫర్నీచర్ ను అందించారు.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# ఇసుక కొరత లేకుండా చర్యలు

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 03:**

జిల్లాలో ఇసుక కొరత రానీయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఆయన జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెమీ మెకనైజ్డ్ విధానంలో యంత్రాలతో ఇసుక తవ్వకాల కోసం పర్యావరణ అనుమతులు పొందామని తెలిపారు. పమిడిముక్కల మండలంలో పటమటలంక, పెనమలూరు మండలంలో చోడవరం, తోట్లవల్లూరు మండలంలో నార్త్ వల్లూరు, రొయ్యూరు వంటి 4 కొత్త రీచ్ లను ఎంపిక చేశామన్నారు. వీటన్నిటికీ త్వరితగతిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ఇసుక తవ్వకాలను ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సెమీ మేకనైజ్డ్ విధానం ద్వారా వినియోగదారులకు సమృద్ధిగా నాణ్యమైన ఇసుక లభించడంతోపాటు ధరలు తగ్గుతాయన్నారు. రానున్న వర్షాకాలంలో నిర్మాణ అవసరాలకు ఇసుక కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుకు అన్ని ఇసుక స్టాక్ యార్డులలో సమృద్ధిగా ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సత్యనారాయణ, గనుల శాఖ ఏడి శ్రీనివాసరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ కొండారెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ పై దాడి చేసిన నిందితులు అరెస్ట్



**చీరాల,పెన్ పవర్,ఏప్రిల్ 03**

స్థలం వివాదంలో నేపథ్యంలో గత ఆదివారం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ పై పలువురు కత్తితో దాడిచేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు నమోదైన కేసులో నిందితులను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మొయిన్ తెలిపారు. ఈపూరుపాలెం పీఎస్ లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావుపై దాడి చేసిన నిందితులను నేడు కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు.

# పేకాట శిబిరంపై మెరుపు దాడి

**వేటపాలెం,పెన్ పవర్,ఏప్రిల్ 03**

గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై వేటపాలెం ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు, సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు.వేటపాలెం మండల పరిధిలోని అక్కాయపాలెం గ్రామ శివారులలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 17,080ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.



# తాబేళ్ల సంరక్షణ అందరి బాధ్యత ఎమ్మెల్యే









**వేటపాలెం,పెన్ పవర్,ఏప్రిల్ 03**

వేటపాలెం మండలం అక్కయపాలెం పంచాయితీ రామాపురం గ్రామంలో సముద్ర తీరము నందు ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ మరియు ట్రీ ఫౌండేషన్ ఐటిసి బంగారు భవిష్యత్ సంయుక్తం గా ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల రక్షణ కేంద్రం నుండి 404 తాబేళ్ల పిల్లల ను చీరాల నియోజాకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య చేతుల మీదుగా గురువారం సముద్రం లోనికి సురక్షితం గా వదిలారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలివ్ రీడ్లి సముద్రపు తాబేళ్లు అంతరించే దశలో ఉండగా అటవీ శాఖ మరియు ట్రీ ఫౌండేషన్ ఐటీసి వారు సంరక్షించడం గొప్ప విషయం అన్నారు అంతే కాకుండా సముద్ర తాబేళ్లు మత్యకారులకు నేస్తాలు అని మత్యాసంపాద పెరుగుదలకు తాబేళ్లు సహకరిస్తారని సముద్రం లో ఉన్న నాచుని ఆహారం గా తీసుకోవడం తో సకల జల జీవ రాశులకు ఆక్సిజన్ అందించడం లో సహాయ పడుతుందని ఇలా తాబేళ్లు పిల్లలను వదలడం చాలా సంతోషం గా ఉంది అన్నారు ఈ కార్యక్రమం లో జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్ భీమయ్య మాట్లాడుతూ జిల్లా లో మొత్తం 6 సముద్ర తాబేళ్ల రక్షణ కేంద్రం లు ఉన్నాయని దాదాపు 145 తాబేళ్లు 15000 గుడ్లు పెట్టగా సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులు సేకరించి అయా కేంద్రాలలో పొదిగించి సముద్రం లోనికి సురక్షితం గా వదులు తున్నారని చీరాల నియోజకవర్గ పరిధిలో రామచంద్ర పురం,పొట్టి సుబ్బయ్య పాలెం మరియు రామాపురం గ్రామంలలో కేంద్రాలు ఉన్నాయి అని వివరించారు ఈ కార్యక్రమం లో ఉమ్మడి జిల్లా ల సమన్వయ కర్త శవనం చంద్రా రెడ్డి ఐటీసీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సూరజ్ ప్రధాన మాజీ సర్పంచ్ జంగిలి రాములు రామాపురం గ్రామ కాపులు మరియు సున్నపు సుబ్బారావు,



మహిళా అధ్యక్షురాలు రజనీ జన సేన ఆర్ కె నాయుడు పొట్టి సుబ్బయ్య పాలెం,రామాపురం మరియు రామ చంద్ర పురం సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులు జాల య్య, వెంకటేష్, జయ రామ్,లక్ష్మయ్య నాగరాజు మరియు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జగన్ లో ఎంత మార్పో...



**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్.రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు.వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట.

**ఈ మార్పు సరిపోదు జగనూ..**

జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్పుడు అసలైన పొలిటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

# విజయనగరంలో వైసీపీ ఖాళీ...?

**విజయనగరం, ఏప్రిల్ 3, పెన్ పవర్:** ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ మరింత పుంజుకుంటోందా? అంటే అవుననే తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలోపు వైసీపీ పూర్తిగా ఖాళీ కాబోతుందా? అంటే కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది.కురుపాం నుంచి ఎస్ కోట నియోజకవర్గం వరకూ ఎక్కడ చూసినా రాజకీయ వలసలు షరా మాములుగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డానికి కష్టించి పని చేసిన హార్డ్ కోర్ ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ కూడా ఇప్పుడు సైకిల్ బెల్లు కొట్టడానికి రెడీ అంటే రెడీ అంటున్నారట.ఒక్కో ఏరియాలో ఫలానా కావాలన్న షరతులు పెట్టకుండానే ఫ్యాన్ వదిలి సైకిలెక్కుతున్నారట. దీనంతటికీ కారణమేంటని చూస్తే.. అందరి నుంచి దాదాపు ఒకటే మాట వినిపిస్తోందట. ఇన్నాళ్ల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పార్టీని అధికారంలోకి తెస్తే.. తమకు మిగిలింది ఏదీ లేదని వీరంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఆ మాటకొస్తే ఫ్యాను రెక్కలు ముక్కలయ్యాయి.. మీ కంటికి కనిపించడం లేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారట. ఇన్నాళ్ల పాటు జగన్ని నమ్ముకున్నందుకు తాము నట్టేట మునిగామనీ అంటున్నారట. ఆ పార్టీలాగే తమ జీవితాలు కూడా అలాగే ఛిన్నాభిన్నమై పోయిందనీ వీరంతా గుర్రుగా ఉన్నారట. దీంతో టీడీపీ, జనసేనకు జై కొడుతున్నారట.మరీ ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాల్టీల్లో అయితే అవిశ్వాసానికి సైతం సిద్ధమయ్యారంటే ఫ్యాను పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే ఒక తిరుగుబాటు మొదలైందట. అవిశ్వాస తీర్మానం పెట్టడమే ఆలస్యమట.స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఫోన్ చేసి బుజ్జగించినా కుదరదని తెగేసి చెబుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. గతంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరాలంటే ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులతో రాయబారం నడిపించాలి. అదే ఇప్పుడు ఇందుకు రివర్స్ లో ఉందట వ్యవహారం. ఎవరూ ఏమీ అడక్కుండానే.. మేమే వచ్చేస్తున్నాం.. వద్దనకండి ప్లీజ్ అంటూ సైకిల్ బెల్ వారంతట వారే మోగిస్తున్నారట. చోటా మోటా నాయక గణం తమంత తాముగా వెళ్లి.. కూటమి పార్టీల కండువాలు కప్పేసుకుంటున్నారట.ఇక నెల్లిమర్ల నియోజకవర్గంలో అయితే వైసీపీని ఎప్పుడు ఖాళీ చేద్దామా? అన్నట్టుందట ఇక్కడి జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి జోరు. వారానికి కనీసం రెండు మూడు గ్రామాల వైసీపీ కార్యకర్తలను తమ గ్లాసు పార్టీలో చేర్పించందే నిద్రపోవడం లేదట ఎమ్మెల్యే మాధవి. భవిష్యత్తులో తమకు పదవులు వచ్చినా రాకపోయినా.. వైసీపీ అనేది ఉండకూడదు. ఎటు నుంచి ఎటు చూసినా జనసేన మాత్రమే కనిపించాలన్నంత కసితో పని చేస్తున్నారట ఈ మహిళా ఎమ్మెల్యే.అయితే జిల్లా కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా ఉందంటున్నారు. కోరి వస్తామన్నా చేద్దాం- చూద్దాం అంటూ దాట వేస్తున్నారట ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు. వైసీపీలో అవినీతి మరక అంటని వారిని మాత్రమే తీసుకుంటున్నారట. ఇప్పటికే వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వస్తామనీ.. కార్పొరేషన్ను టీడీపీ పరం చేస్తామని బంపరాఫర్లు ప్రకటిస్తున్నా.. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వద్దంటే వద్దంటున్నారట. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎవరికి అధికారం ఇస్తే.. వారే పరిపాలించాలని హితబోధ చేస్తున్నారట. అందులోనూ ఎవరిని పడితే వారిని పార్టీలోకి తీసుకుంటే నష్టం తమకేనని.. వారిస్తున్నారట. దీంతో తండ్రి మాట జవదాటలేక మున్సిపల్ ఎన్నికలు వచ్చే వరకూ వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారటు ఎమ్మెల్యే.ఇక ఎస్ కోట, చీపురుపల్లి, సాలూరు, గజపతినగరం, కురుపాం నియోజకవర్గాలలో చేరికల పరంపర ఒక రేంజిలో కొనసాగుతోందట. రోజుకో నియోజకవర్గంలో భారీ స్థాయిలో చేరికలు కనిపిస్తున్నాయట. గ్రామాలకు గ్రామాలు సైకిల్ కి సై అంటున్నాయట. దీంతో వైసీపీ లీడర్లు బయటకు రావడానికే తటపటాయించాల్సి వస్తోందట. పార్టీ ఖాళీ అవుతుంటే ఇటు చూస్తూ ఊరుకోలేక, అటు అధినేతకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారట. ఏది ఏమైనా.. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు వచ్చే నాటికి ఈ ప్రాంతాల్లో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయట.

# దేవాదాయశాఖలో ఇంటి దొంగలు

**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** విజయవాడలో దేవాదాయ శాఖ భూములతో బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన వెలుగు చూసింది. నగరం నడిబొడ్డున ఉన్న దాదాపు ఆరెకరాల భూమి అన్యాక్రాంతమైనా? దేవాదాయ శాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇవే భూములకు నకిలీ పత్రాలను సృష్టించి వందల కోట్లకు బ్యాంకుల్ని మోసం చేశారు. దేవాదాయ శాఖకు దానపత్రం రాసిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా వాటిని రక్షించేందుకు చర్యలు చేపట్టకపోవడం వెనుక దేవాదాయ శాఖ బాధ్యతలు చూసిన మాజీ మంత్రి హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.విజయవాడ పటమటలో ఉన్న గోవిందరాజులు ధర్మ ఈనాం ట్రస్ట్ భూములు ఉన్నాయి. భూముల్ని దానం ఇచ్చిన దాతల కుటుంబానికి చెందిన మూడో తరం వారసులు భూముల విలువ పెరగడంతో అవి కుటుంబ ఆస్తులంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. ఆ భూముల్ని అమ్ముకోడానికి అనుమతివ్వాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో భూములను దానం ఇచ్చిన సమయంలోనే వాటిని ధర్మకార్యక్రమాలలో దేనికి వినియోగించాలో స్పష్టం చేస్తూ రాసిన దాన పత్రం వెలుగు చూసింది. నగరం మధ్యలో ఉన్న వందల కోట్ల ఖరీదు చేసే ఈ భూమిని కాజేయడానికి కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో దేవాదాయ శాఖకు సారథ్యం వహించిన మంత్రి అండతో భూముల్ని అమ్మేసే స్కెచ్ వేశారు. అంతకు ముందే ఇవే భూములపై ఓ జాతీయ బ్యాంకులో రుణాన్ని కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో 2023లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ భూముల వ్యవహారంపై 2023లో మచిలీపట్నం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో బి.సుబ్బారావు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక వెలుగు చూసింది.పబ్లిక్ ట్రస్ట్ కు సంబంధించిన భూమిని ప్రైవేట్ ట్రస్టుగా భావిస్తూ ట్రస్టీ ఎప్పుడూ భూమికి యజమాని కాలేదని గతంలో సుప్రీం కోర్టు, హైకోర్టులు స్పష్టం చేశాయని, ఆ తీర్పులకు విరుద్ధంగా కింది కోర్టులు ఇచ్చిన డిక్రీలను అడ్డం పెట్టుకుని భూముల్ని అమ్మే ప్రయత్నాలు చేయడంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ట్రస్టు నిర్వహిస్తోన్న ట్రస్టీ దేవాదాయ చట్టం సెక్షన్ 30/87 ప్రకారం ఆస్తులను కాపాడలేకపోవడంతో చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ట్రస్ట్ కార్యక్రమాల నుంచి తొలగించి వేరేవారిని నియమించడంతో పాటు ట్రస్ట్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేశారు.విజయవాడ నగరంలో ఉన్న దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంపై హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విజయవాడ కనకదుర్గ దేవస్థానం భూముల్ని 50 ఏళ్లకు లీజుకిచ్చే అంశం వెలుగు చూసింది. ఈ క్రమంలోనే విజయవాడలో వందల కోట్ల దేవాదాయ శాఖ ఆస్తులు పరాధీనమైన వైనం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దేవాదాయ భూములను కాపాడాలని పోరాడుతున్న వారు వీటిని వెలుగులోకి తెస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో ఖరీదైన భూముల వ్యవహారంలో ఉదాసీనత బయటపడింది. సామాజిక, దైవిక కార్యక్రమాలకు చెందిన భూములను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే పటమటలో ఉన్న గోవిందరాజు ట్రస్టు ఈనాం భూముల్ని చూపి జాతీయ బ్యాంకులో రూ.100కోట్ల రుణం తీసుకోవడం గతంలోనే వెలుగులోకి వచ్చింది. ఏపీకి చెందిన జాతీయ బ్యాంకు మరో బ్యాంకులో విలీనమైన తర్వాత ఈ వ్యవహారం పూర్తిగా మరుగున పడిపోయింది. అసలు వడ్డీలతో కలిపి ఈ మోసం విలువ రూ.200కోట్లు వరకు ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి.గోవిందరాజు వంశానికి చెందిన వారు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన పటమటలోని సర్వే నెంబర్ 91/2లోని 5,92 ఎకరాల స్థలాన్ని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టుకు దానం చేశారు. రిజిస్టర్డ్ డీడ్ ప్రకారం భూమిని జాగ్రత్తగా కాపాడాలని, ఈ భూమి ద్వారా వచ్చే ఆదాయాన్ని నాలుగు బాగాలు చేసి ధార్మిక కార్యక్రమాలకు వాడాలని, ఏ భాగం ఎందుకు వాడాలో కూడా దాన పత్రంలో స్పష్టం చేశారు.గోవింద రాజులు ట్రస్టుకు సంబంధించిన భూముల్ని లీజుకు తీసుకున్న వారి వారసుడు పదేళ్ల క్రితమే ఈ భూముల్ని తనఖా పెట్టి రూ.100కోట్ల రుణాన్ని తీసుకుని వాటిని చెల్లించలేదు.వడ్డీలతో కలిపి రుణమొత్తం భారీగా పెరిగింది. ఈ క్రమంలో గోవింద రాజు ట్రస్టును శ్రీ గోవింద రాజు ట్రస్టు పేరుతో దేవాదాయ శాఖను ప్రతివాదిగా చేర్చకుండా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనికి విజయవాడకు చెందిన ఓ పార్టీ ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ మంత్రి ఒకరు సహకరించినట్టు తెలుస్తోంది.అసలైన ట్రస్టీలు ఉన్న సమయంలోనే ఆ భూముల్లో కొంత భాగాన్ని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించడంతో అక్కడ దశాబ్దాలుగా హైస్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్ నిర్వహిస్తున్నభూమిని కార్పొరేషన్‌కు గతంలోనే రిజిస్ట్రేషన్ చేశారు. 5.90 ఎకరాల భూమి దేవాదాయ శాఖకు చెందినదేనని 2023లో నే విచారణాధికారి నివేదిక సమర్పించినా నాటి ప్రభుత్వం దానిని అమోదించకుండా తొక్కి పెట్టింది.భూమి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటే అసలు దొంగలు బయటపడతారు. దీంతో నివేదిక వెలుగు చూడకుండా విజయవాడకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ప్రజాప్రతినిధులు, అధికారులకు చిక్కులు తప్పవని హిందూ ధార్మిక సంఘాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు.

## సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

**రాజమండ్రి, ఏప్రిల్ 3, పెన్ పవర్:** నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీఫుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళ్లు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు.ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు.చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా?హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు?ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. అలా కొన్నిగంటల సేపు మాత్రమే బుకాయించ గలిగారు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. అదే నిజమని తేలితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# సినిమాల్లోకి దువ్వాడ...

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4, పెన్ పవర్:** దువ్వాడ శ్రీనివాస్-మాధురి.. ఏ తెలుగు న్యూస్ ఛానెల్ చూసినా, యూట్యూబ్ ఛానెల్ చూసినా వీరిద్దరి సందడి అంతా ఇంతా కాదు. మాధురి ఎపిసోడ్ కి టాప్ రేటింగ్స్ రావడంతో అప్పట్నుంచి ఆమెను మీడియా నీడలా అనుసరిస్తోంది. మాధురిని ఆకాశానికెత్తేయడం, ఆమెను హీరోయిన్ లా ఉన్నారని అనడం, అందులోనూ నగ్మాతో పోల్చడం.. ఆమెతో క్యాట్ వాక్ చేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ చేయించడం.. అబ్బో ఇలాంటి సీన్స్ ఇంటర్వ్యూల్లో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా ఎంట్రీ విషయంపై మరోసారి క్లారిటీ ఇచ్చారు మాధురి.మాధురికి చాలా క్వాలిఫికేషన్లు ఉన్నాయని పొలిటీషియన్, వుమన్ ఎంటర్ ప్రెన్యూర్, ఇన్ ఫ్లూయెన్సర్, ఫైర్ బ్రాండ్.. ఇలా చాలా ఉన్నాయని, సినిమా హీరోయిన్ కూడా అందులో యాడ్ అవుతోందని యాంకర్ ఆమెను పొగడ్తల్లో ముంచెత్తారు. మాధురి కూడా తనకు చిన్నప్పటినుంచి యాక్టింగ్ అంటే ఆసక్తి ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాదు, గతంలో తనకు టైమ్ దొరకలేదని, ఛాన్స్ దొరకలేదని.. టైమ్ వచ్చినప్పుడు అది కూడా జరుగుతుందని చెప్పుకొచ్చారు మాధురి.మాధురి తనకు సినిమాల్లోకి వెళ్లాలనుంది అని అనగానే, పక్కనే ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ఊరుకుంటారా..? ఆయన కూడా మాధురి టాలెంట్ ని బయటపెట్టారు. పాటలు పాడటం కంటే కంటే ఆమె డ్యాన్స్ బాగా చేస్తుందని చెప్పుకొచ్చారు. భరతనాట్యంలో ఆమెకు ప్రవేశం ఉందన్నారు. నెమలికి నేర్పిన నడకలివీ అనే పాటతోపాటు, చాలా పాటలకు ఆమె అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుందన్నారు. గతంలో దువ్వాడ కూడా మాధురిని అడిగి మరీ కొన్ని పాటలకు డ్యాన్స్ వేయించుకునేవారట.దువ్వాడ శ్రీనివాస్ తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే ఇష్టమని, ఆయనే తనకు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆయన సినిమాల్ని తాను చూస్తుంటానని, హోమ్ థియేటర్లో ఆయన సినిమాలు చూస్తానన్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు తాను థియేటర్లకు వెళ్తుంటానన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ని కూడా తాను అభిమానిస్తానని, అయితే తాను సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్ అని చెప్పుకొచ్చారు దువ్వాడ. కార్ లో సీనియర్ ఎన్టీఆర్ పాటలు పెట్టుకుంటారని, అప్పుడప్పుడు ఆ పాటలకు అర్థాలు తనకు చెబుతుంటారని కోరస్ ఇచ్చారు మాధురి.శ్రీనివాస్ కి కూడా సినిమాలంటే బాగా ఇష్టం. ఆమధ్య మాధురి నిర్మాతగా ఆయన ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించినట్టు వార్తలొచ్చాయి. నటించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ఇక మాధురి కూడా తన యాక్టింగ్ పెర్ఫామెన్స్ ని వెండితెరపై చూపించాలనుకుంటున్నారు. ఫైనల్ గా వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా నటించే అవకాశం ఉందేమోనని అనిపిస్తోంది. దువ్వాడ-మాధురి కాంబినేషన్ ఇప్పటికే బుల్లితెరపై, యూట్యూబ్ లో సూపర్ హిట్ అయింది. వీరి ప్రోగ్రామ్ లకు మంచి ప్రేక్షకాదరణ ఉంది. ఇక వీరు సినీరంగంలోకి వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. షార్ట్ ఫిల్మ్ ల వరకు ఓకే, వెండితెరపై కనపడాలంటే అది కాస్త ఖర్చుతో కూడుకున్న పని, దానికి దువ్వాడ సిద్ధపడతారా..? మాధురి తెరంగేట్రానికి తానే నిర్మాత అవుతారా..? వేచి చూడాలి.

# బొత్సపై జనసేన ప్రత్యేక దృష్టి



**విజయవాడ, ఏప్రిల్ 2 పెన్ పవర్:** : ఏపీలో ( రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఆ పార్టీకి కీలక నేతలు గుడ్ బై చెబుతూ వచ్చారు. పార్టీలో నెంబర్ 2 స్థాయి కలిగిన నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. గత ఐదేళ్లపాటు పదవులతో పాటు ఆ పార్టీలో గౌరవం పొందిన నేతలు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యులతో పాటు ఎమ్మెల్సీలు సైతం పదవులను వదులుకున్నారు. విజయసాయిరెడ్డి లాంటి నేత వైసిపికి గుడ్ బై చెప్పడం ఆందోళన కలిగించే అంశమే. అయితే ఇప్పుడు తాజాగా బొత్స సత్యనారాయణ పై సైతం అనుమానపు చూపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.వాస్తవానికి బొత్స సత్యనారాయణ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అందుకు అనుగుణంగా బొత్స పవన్ కళ్యాణ్ ను ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భిన్నంగా బొత్స వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణాల్లో ఎదురుపడినప్పుడు ఆప్యాయ పలకరింతలు, ఆ లింగనాలు చేసుకుంటున్నారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ సైతం బొత్స విషయంలో పార్టీ శ్రేణులకు చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. బొత్సను పార్టీలోకి తెస్తే ఎలా ఉంటుంది అని పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించినట్లు సమాచారం. అయితే జనసేన నాయకుల నుంచి సానుకూలత రావడంతో పవన్ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. కొందరు అరెస్టులు కూడా అయ్యారు. కానీ బొత్స విషయంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేశారు బొత్స. కానీ ఎన్నడు రివేంజ్ రాజకీయాలు నడపలేదన్నది ఆయనపై ఉన్న మంచి ముద్ర. అందుకే కూటమి ప్రభుత్వంలో సైతం ఆయనకు సరైన గౌరవం దక్కుతోంది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ శాసనమండలిపక్ష నేతగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. పార్టీ తరఫున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. అటువంటి నేతను జనసేనలోకి తెచ్చుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీయవచ్చని పవన్ భావిస్తున్నారట. ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు బొత్స. విజయనగరం జిల్లాలో అయితే నాలుగు నియోజకవర్గాలు ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉంటాయి. మిగతా నియోజకవర్గంలో సైతం ప్రభావం చూపగలరు. ఉత్తరాంధ్రలో బలమైన తూర్పు కాపు సామాజిక వర్గంలో పట్టున్న నేత. అందుకే ఆయనను జనసేనలోకి రప్పించుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని పవన్ భావిస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## వెస్టిండీస్, సౌతాఫ్రికాలతో సిరీస్.. 2025 టీమిండియా హోమ్ షెడ్యూల్, టైమింగ్ వివరాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా క్రికెట్ ఫ్యాన్స్ ప్రస్తుతం ఐపీఎల్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఐపీఎల్ తర్వాత 2025లో భారత క్రికెట్ జట్టు సొంతగడ్డపై ఆడబోయే క్రికెట్ షెడ్యూల్ వచ్చేసింది. బీసీసీఐ బుధవారం (ఏప్రిల్ 2) 2025-26 సీజన్ లో టీమిండియా స్వదేశంలో ఆడబోయే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లతో టీమిండియా స్వదేశంలో సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌తో ఇండియా హోమ్ సీజన్ ప్రారంభమవుతుంది.

వెస్టిండీస్ తో భారత్ రెండు టెస్టులు ఆడనుంది. అక్టోబర్ 2 నుంచి 6 వరకు తొలి టెస్ట్ మ్యాచ్.. అక్టోబర్ 10 నుంచి 14 వరకు రెండో టెస్ట్ జరుగుతుంది. తొలి టెస్టుకు అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం ఆతిథ్యమిస్తుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో రెండో టెస్ట్ జరుగుతుంది. మ్యాచ్ భారత కాలమాన ప్రకారం ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతుంది.

విండీస్ తర్వాత నవంబర్- డిసెంబర్ నెలలో సౌతాఫ్రికా ఇండియాలో పర్యటిస్తుంది. మూడు ఫార్మాట్ లలో టీమిండియా.. సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ సుదీర్ఘ టూర్ లో సౌతాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. నవంబర్ 14 నుంచి 18 వరకు తొలి టెస్ట్ న్యూఢిల్లీ వేదికగా అరుణ్ జైట్లీ స్టేడియంలో.. నవంబర్ 22 నుంచి 26 వరకు గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో రెండో టెస్ట్ జరుగుతుంది. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిధ్యమిస్తాయి. డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు మొత్తం 5 టీ 20 మ్యాచ్ లు జరుగుతాయి. డిసెంబర్ 9 న కటక్ వేదికగా తొలి టీ20.. డిసెంబర్ 11 న్యూ చండీగఢ్ వేదికగా రెండో టీ20.. డిసెంబర్ 14 న ధర్మశాల వేదికగా మూడో టీ20.. డిసెంబర్ 17 న లక్నో వేదికగా నాలుగో టీ20.. డిసెంబర్ 19న అహ్మదాబాద్ లో ఐదో టీ20 జరుగుతాయి. వన్డే మ్యాచ్ లో మధ్యాహ్నం 1:30 నిమిషాలకు.. టీ20 మ్యాచ్ లు రాత్రి 7:00 గంటలకు ప్రారంభమవుతాయి.

## కోహ్లీకి గాయం.. ముంబైతో మ్యాచ్ ఆడతాడా.. RCB హెడ్ కోచ్ ఏమన్నాడంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ మాజీ కెప్టెన్.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయపడ్డాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం (ఏప్రిల్ 2) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో కోహ్లీ ఫీల్డింగ్ చేస్తుండగా గాయమైంది. టైటాన్స్ ఇన్నింగ్స్ 12వ ఓవర్లో ఈ సంఘటన జరిగింది. ఆర్సీబీ స్పిన్నర్ కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో సాయి సుదర్శన్ గట్టిగా స్వీప్ ఆడాడు. డీప్ మిడ్-వికెట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కోహ్లీ బంతిని ఆపడానికి పరిగెత్తే ప్రయత్నంలో అతని చేతి వేలికి గాయం అయింది. దీంతో గ్రౌండ్ లోనే నొప్పితో కోహ్లీ చేయి ఊపుతూ కనిపించాడు.కోహ్లీ గాయంపై అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే అభిమానులకు గుడ్ న్యూస్ చెబుతూ.. విరాట్ గాయంపై ఆర్సీబీ హెడ్ కోచ్ క్లారిటీ ఇచ్చాడు. కోహ్లీ ప్రస్తుతం బాగానే ఉన్నాడని.. అతని ఎలాంటి సమస్య లేదని చెప్పాడు. దీంతో కింగ్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. బెంగళూరు ఐపీఎల్ లో తమ తదుపరి మ్యాచ్ ను ఏప్రిల్ 7న ముంబై ఇండియన్స్ తో తలపడనుంది. ఈ మ్యాచ్ లో కోహ్లీ ఆడడం ఖాయమైంది. ఈ మ్యాచ్ లో కోహ్లీ 6 బంతుల్లో 7 పరుగులే చేసి ఔటయ్యాడు. స్వేర్ లెగ్‌లో షాట్‌కు యత్నించి యంగ్ బౌలర్ అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో వికెట్ సమర్పించుకున్నాడు.




ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. బుధవారం (ఏప్రిల్ 2) చిన్న స్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బౌలింగ్ లో సిరాజ్ నిప్పులు చెరగగా..ఆ తర్వాత ఛేజింగ్ లో బట్లర్( 39 బంతుల్లో 73:5 ఫోర్లు, 6 సిక్సర్లు) సాయి సుదర్శన్ (49) బ్యాటింగ్ లో అదరగొట్టారు. ఈ సీజన్ లో వరుసగా రెండు విజయాలు సాధించిన ఆర్సీబీ తొలి పరాజయాన్ని మూట కట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది.

## నేను వన్ ఆఫ్ ది బెస్ట్ స్పిన్నర్.. చెప్పిన మాట నిలబెట్టుకున్న యువ క్రికెటర్!



**హైదరాబాద్ పెన్ పవర్:** రవిశ్రీనివాసన్ సాయి కిషోర్.. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లో అదరగొడుతున్నాడు. ఆడిన మూడు మ్యాచ్ ల్లో 6 వికెట్లు పడగొట్టి ఐపీఎల్ 2025 సీజన్ ను గ్రాండ్ గా ఆరంభించాడు. బ్యాటింగ్ పిచ్ లపై రవి కిషోర్ బౌలింగ్ చేస్తున్న తీరు అద్భుతం. గుజరాత్ టైటాన్స్ తరపున ఆడుతున్న ఈ 28 ఏళ్ళ స్పిన్నర్ మూడు మ్యాచ్ ల్లో కట్టుదిట్టమైన బౌలింగ్ లో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాడు. సహచరుడు రషీద్ ఖాన్ భారీగా పరుగులిస్తున్నా.. ఈ తమిళ నాడు స్పిన్నర్ మాత్రం తన వేరియేషన్ తో ఆకట్టుకుంటున్నాడు.

బుధవారం (ఏప్రిల్ 2) రాయల్ ఛాలెంజర్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో 4 ఓవర్లలో 22 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ తర్వాత సాయి కిషోర్ చెప్పిన ఒక స్టేట్ మెంట్ వైరల్ అవుతుంది. 2024 దులీప్ ట్రోఫీకి ముందు సాయి కిషోర్.. సెలక్టర్లు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. "నేను దేశంలోని అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడినని భావిస్తున్నాను. నన్ను టెస్ట్ మ్యాచ్‌లకు సెలక్ట్ చేస్తే నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నేను ఎక్కువగా ఆందోళన చెందాల్సిన పని లేదు." అని ఈ యువ క్రికెటర్ చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం బ్యాటింగ్ కు స్వర్గధామంగా ఉన్న పిచ్ లపై సాయి కిషోర్ బౌలింగ్ చేస్తున్న తీరు అద్భుతం. అతను గత సంవత్సరంలో ఇచ్చిన స్టేట్ మెంట్ కు న్యాయం చేశాడనిపిస్తుంది. గత సీజన్ లో కూడా గుజరాత్ జట్టుతోనే ఉన్న సాయి కిషోర్ 19.57 సగటుతో 5 మ్యాచ్‌లలో 7 వికెట్లు పడగొట్టి పర్వాలేదనిపించాడు. ఇదంతా పక్కన పెడితే టీమిండియాలో చోటు దక్కించుకోవడం అంత సామాన్యమైన విషయం కాదు. ముఖ్యంగా స్పిన్ విభాగంలో చాలా కష్టం. స్పిన్నర్లు ఎక్కువగా ఉండే మన దేశంలో ఎంతో అనుభవమున్న యుజ్వేంద్ర చాహల్ కు సైతం జట్టులో స్థానం దక్కడం లేదు. ఐపీఎల్ తర్వాత సాయి కిషోర్ ను సెలక్టర్లు ఏమైనా పరిగణిస్తారేమో చూడాలి.

## అద్భుతమైన లుక్స్



## జైలర్ -2! లో బాలయ్య వర్సెస్ సూర్య!



సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో - జైలర్ -2- పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చెన్నైలో షూటింగ్ జరుగుతోంది. అయితే ఇందులో ఎంత మంది స్టార్ హీరోలు నటిస్తున్నారు? అన్న దానిపై ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు.తొలి భాగంలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్ లాంటి స్టార్లు గెస్ట్ అప్పియిన్స్ తో అదొరగొట్టడంతో? - జైలర్ 2- లో అంతకు మించే ఉంటుంది తప్ప తగ్గదు అనే ప్రచారం తొలి నుంచి జరుగుతూనే ఉంది. టాలీవుడ్ నుంచి నటసింహా బాలకృష్ణ పవర్ ఫుల్ పాత్రలో రంగంలోకి దిగుతున్నారని ఇప్పటికే ప్రచారంలో ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్ కి ఏ మాత్రం తగ్గకుండా తెరపై కనిపించినంత సేపు విధ్వంసంలాగే పాత్ర నడుస్తుందని ప్రచారం జరిగింది. కంటున్యూటీగా మోహన్ లాల్, శివన్న పాత్రలు యధావిధిగా ఉంటాయని వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో సంచలన నటుడి పేరు తెరపైకి వస్తోంది. కోలీవుడ్ విలక్షణ నటుడు సూర్య కూడా ఇందులో ఓ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. నెల్సన్ సూర్యతో చర్చలు జరుపుతున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక సమాచారం వెలువడుతుందని వినిపిస్తుంది. నిజంగా సూర్య కూడా ఎంటర్ అయితే ప్రాజెక్ట్ నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. బాలయ్య ను పాజిటివ్ రోల్ లో లాంచ్ చేసి సూర్య కు పవర్ ఫుల్ నెగిటివ్ రోల్ అప్పగించి..వాళ్లిద్దరి మధ్యా మాటల యుద్ధం...భారీ యాక్షన్ సీన్ ప్లాన్ చేస్తే మామూలుగా ఉండదు. సూపర్ స్టార్ ఇమేజ్ సైతం కొట్టుకుపోయే పెర్ఫార్మెన్స్ తో అదర గొడతారు. ఆ సీన్స్ కు సూపర్ స్టార్ ఇమేజ్ టచ్ అప్ ఇస్తే నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. బాలయ్య కు కోలీవుడ్ లో కూడా మాస్ ఫీల్ దక్కుతుంది. మరి నెల్సన్ ఎలాంటి వ్యూహంతో ఉన్నాడో చూడాలి.

## అనసూయ భరద్వాజ్ పూల చీర లుక్ తప్పక చూడాలి



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com